

నేటి దినపత్రిక **సూర్య** ఉత్తరాంధ్ర

www.suryaa.com

శుక్రవారం 2-8-2024 పేజీలు 7

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం | విజయనగరం శ్రీకాకుళం


# మాంగనీస్ దిగుమతిలో విశాఖపట్నం పోర్టు రికార్డు

## చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మాంగనీస్ దిగుమతిలో విశాఖ పోర్టు మరో విజయం సాధించిందని పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఓ ప్రకటనలో తెలిపారు. సరకు రవాణాలో గతం రికార్డుల్ని తిరగరాసిందని, జూలై నెలలో అత్యధిక స్థాయిలో మాంగనీస్‌ను దిగుమతి చేసుకుందన్నారు. మొత్తం 15 నౌకల ద్వారా 5,66,301 మెట్రిక్ టన్నుల సరకును దిగుమతి చేసుకోవడం శుభపరిణామమన్నారు. గత మేలో 17 నౌకల ద్వారా 4,37,270 మెట్రిక్ టన్నుల సరకు దిగుమతి అయిందన్నారు. ఇప్పటి వరకు పోర్టు దిగుమతి చేసుకున్న అత్యధిక మాంగనీస్ దిగుమతిగా ఆ సారి రికార్డులకెక్కామన్నారు. పోర్టు 90ఏళ్ల చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచిందని, ఈ ఘనతను సాధించడంలో విశేష కృషి చేసిన ట్రాఫిక్ మేనేజర్, సిబ్బందిని చైర్ పర్సన్ ప్రశంసించారు. పోర్టు సిబ్బంది ఇదే తరహాలో కష్టించి పని చేయడం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాకు చేరుకుంటుందనే విశ్వాసాన్ని అంగముత్తు వ్యక్తం చేశారు.

# కొండవాలు ప్రాంతాలలో శిధిలావస్త ఇళ్లను గుర్తించండి

## జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** అధిక వర్షాలు దృష్ట్యా నగరంలో గల కొండవాలు ప్రాంతాల నందు శిథిలావస్థలోనున్న ఇళ్లను గుర్తించి, ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే దిశగా సర్వే నిర్వహించి ప్రణాళికలను సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్,ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్ కుమార్ లతో కలసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరం నందు ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, యుసిడి అధికారులు, జోనల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధిక వర్షాలు దృష్ట్యా, నగరం లో గల కొండవాలు ప్రాంతాల నందు శిధిలావస్థలోనున్న ఇళ్లను గుర్తించేందుకు వెంటనే ప్లానింగ్ ,ఎమినిటీస్ కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సర్వే నిర్వహించాలని, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా వారిని అప్రమత్తం చేయాలని, ప్రమాదాల సంభవించినప్పుడు ప్రజలకు ఆశ్రయాలు కల్పించేందుకు తాత్కాలికంగా ముందస్తుగా రిహాబిలిటేషన్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అలాగే కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నవో సర్వే చేసి, నివాసితులు ప్రమాదాలకు గురికాకుండా శాశ్వత ప్రాతిపదికన అవసరమగు రక్షణ గోడలు ,ఇతర రక్షణ చర్యలు, ప్రత్యామ్నాయ దిశగా శాశ్వత పునరావాస ఆశ్రయాలు ఏర్పాటు కు ప్రణాళికలను, రోడ్లు, త్రాగునీరు ఇతర మౌలిక సదుపాయాలను గుర్తించి అవసరమగు వాటి కల్పన కొరకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను జీవీఎంసీ యంత్రాంగం అప్రమత్తం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు వారి వారి ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల కొరకు మౌలిక సదుపాయాల కల్పనకై సూచిస్తున్న ప్రతిపాదనలకు అనుగుణంగా, ముందస్తుగా అధికారులు సర్వే నిర్వహించుకోవాలని, అలాగే ఎన్ని రోడ్లు ఎంత విస్తీర్ణంలో వేయడం జరిగింది లాంటి తదితర చెక్ లిస్టును తయారు చేసుకుని ప్రణాళికలను సిద్ధం చేసుకున్నట్లయితే తగిన ఖర్చును నియంత్రించుకోగలమని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు అందించే సేవలో ఎటువంటి లోటుపాటులుడ లేకుండా సచివాలయాలు,

మిగతా 2లో

## ఏ కష్టమొచ్చినా.. మేమున్నాం..

# ఆధైర్యంపడొద్దు..!

### పార్టీ బలోపేతానికి కృషిచేయండి

### :వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి



(సూర్య ప్రతినిధి-విశాఖపట్నం)

సాధరణ ఎన్నికల్లో ఓడిపోయామని ఆధైర్యం పడకండి. ఓటింగ్ శాతం అధికంగానే వచ్చింది. ఏ ఒక్కరికీ నిరాశ నిస్ప్రృహలొద్దు. ఏ కష్టమొచ్చినా పార్టీ ఆదుకుంటోందంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యనేతలు, కార్యకర్తలకు ఆభయమిచ్చారు. గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డితో పాటు విశాఖకు చెందిన ముఖ్యనేతలు, జీవీఎంసీ కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె రాజు, కార్పొరేటర్లు తదితరులతో పలు అంశాలపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చర్చించారు. అధికారంలో వున్న కూటమి నేతలు చేపడుతున్న బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని సూచించారు. రానున్న కాలంలో మన పార్టీదే అధికారమని, ఏ ఒక్కరూ నిరాశపడవద్దని ఆయన స్పష్టంచేశారు. కూటమి నేతల ప్రలోభాలకు గురికావద్దు అని ఆయన వివరించారు. జీవీఎంసీలో త్వరలో

మిగతా 2లో

# ఏయూ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- -పార్లమెంటులో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి
- -ఏపీ కేంద్ర విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధులు కావాలి
- -రెల్లి గ్రామంలో గిరిజన విశ్వవిద్యాలయం ఉంటే మరిన్ని ప్రయోజనాలన్న శ్రీభరత్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విశాఖ లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి కావలసిన నిధులను తక్షణం విడుదల చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం పార్లమెంటులో ప్రసంగించారు. కేంద్ర ప్రభు త్వం నుండి మొదటి దశకు ఇప్పటికీ విడుదల కాకపోయిన రూ.150 కోట్లు ఇంకా పెండింగ్ లో ఉండగా, రెండవ దశకు అదనంగా రూ.400 కోట్లు కావాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని ఆయన అన్నారు. ఈ నిధులను త్వరితగతిన విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద ఆంధ్రప్రదేశ్ లోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధుల అవసరాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రాంతీయ మరియు గిరిజన విద్యలో కీలక పాత్ర పోషించబోతున్న ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మరియు కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రస్తుత సవాళ్లను అధిగమించడానికి మరియు వాటి లక్ష్యాలను నెరవేర్చడానికి ప్రత్యేక దృష్టిని చూపెట్టాలి అని ఆయన కోరారు. ప్రస్తుతం కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయంలో తగిన సౌకర్యాలు లేకుండా నిర్వహణ జరగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన రెల్లి గ్రామం, విశాఖపట్నానికి సమీపంగా ఉన్నందు వల్ల విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ నియామకానికి మెరుగైన అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలు ఉండేవని ఆయన పేర్కొన్నారు. విద్యా బడ్జెట్ కేటాయింపులను పెంచినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర విద్యాలయాల బడ్జెట్ 11.22శాతం పెరగడం ద్వారా విద్యా నాణ్యత మరియు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి బలమైన కట్టుబాటును ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అదనంగా, కేంద్ర విశ్వవిద్యాలయాల బడ్జెట్ 38.16 శాతం పెరిగినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాల కోసం కేటాయింపులు కేంద్ర విశ్వవిద్యాలయాల మద్దతు కింద పొందుపరచబడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సంస్థలు తమ కీలక విద్యా మిషన్లను కొనసాగించడానికి అవసరమైన వనరులు మరియు నిధులను పొందడాన్ని నిర్ధారించుకోవాల్సిన అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

## 'స్థానిక' ఎమ్మెల్సీ సీటు కోసం..

# వ్యూహాత్మకంగా వైసీపీ అడుగులు!

- -ఎవర్ని బరిలోకి దింపాలనే అంశంపై తర్జనభర్జన
- -బూడి, గుడివాడల్లో ఎవరో ఒకర్ని బరిలోకి దింపే అవకాశం

పిఎరావు

(సూర్య ప్రతినిధి-విశాఖపట్నం)





ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్దమైంది. ఈ నెల 30న జరగనున్న ఎవెమ్మెల్సీ ఎన్నికల్లో ఎవర్ని పోటీకి పెట్టాలనే అంశంపై ఆ పార్టీ అధిష్టానం తర్జనభర్జనపడుతోంది. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడ్ని బరిలోకి దింపాలా? మాజీ మంత్రి గుడివాడ

మిగతా 2లో

# యలమంచిలి కూటమిలో కుమ్ములాటలు

- -టీడీపీని టార్గెట్ చేసిన జనసేన
- -ఎన్నికల్లో రూ లక్షలు ఖర్చు చేసిన టీడీపీ నేతలు
- -ముదిరిన నునపర్తి భూ వివాదం



**యలమంచిలి ప్రతినిధి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలోని కూటమిలో కుమ్మలాటలు ప్రారంభం అయ్యాయి. జనసేన ఆగడాలపై టీడీపీ శ్రేణులు ముఖ్యనేతలైన మాజీ ఎంపీ పప్పల చలపతిరావుకు, యలమంచిలి టీడీపీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసాయి. ఇదే కొనసాగితే రాష్ట్రంలో అధికారంలో వున్న టీడీపీ యలమంచిలిలో మాత్రం కనుమరుగు కావడం ఖాయమని సంకేతాలిచ్చేసారు. అంతేగాక టీడీపీ అధిష్టానం రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దకపోతే పరిణామాలు ఘోరంగా వుంటాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి నియోజకవర్గంలో కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థిగా సుందరపు విజయ్ కుమార్ పోటీ చేసి గెలుపొందిన

మిగతా 2లో

# రైతు కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

## పెద్దగడ్డ నీటిని విడుదల చేసిన మంత్రి సంధ్యారాణి



**పాచిపెంట, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** రైతన్న సుభిక్షంగా ఉంటే రాజ్యం సురక్షితంగా ఉంటుందని వారి కళ్ళల్లో ఆనందమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ప్రాజెక్టుల్లో జలకళ ఉట్టిపడేలా చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి స్పష్టం చేశారు. పెద్దగడ్డ ప్రాజెక్ట్ నీటిని ఖరీఫ్ కు గురువారం విడుదల చేశారు. జలాశయంలో 0.919 టి.యం.సి (96 శాతం) నీరు కలదని, ఆయకట్టుదారులు అందరు పొదుపుగా వాడుకుంటే ఈ ఖరీఫ్ కు నీరు సమృద్ధిగా సరిపోతుందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం సాగునీరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించిందని ఆమె పేర్కొన్నారు. జైకా నిధులు కూడా దారి మళ్ళించడం వలన రైతులకు అన్యాయం జరిగిందని ఆమె అన్నారు. పాసు పుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేయుటకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ఆమె వివరించారు. గత ప్రభుత్వంలో 5 సంవత్సరాలలో కాలువలు పూడిక తీత కూడా తీయలేదని ఆమె పేర్కొన్నారు. సంపద సృష్టించి అభివృద్ధి చేయటం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని మంత్రి అన్నారు. పెద్దగెడ్డ ప్రాజెక్టు వద్ద అతి త్వరలో పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఆమె అన్నారు. పెద్దగడ్డ ప్రాజెక్ట్ ద్వారా పాచిపెంట మండలంలో 6319.50 ఎకరాల ఆయకట్టు, సాలూరు మండలంలో 2826 ఎకరాల ఆయకట్టు, రామభద్రా పురం మండలంలో 3076 ఎకరాల ఆయకట్టు వెరసి 12221.50 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. పెద్దగడ్డ కుడి ప్రధాని కాలువ ద్వారా 79 క్యూసెక్కుల నీటితో 7565.50 ఎకరాలుకు, వేగావతి ఎడమ ప్రధాన కాలువ ద్వారా 65 క్యూసెక్కుల నీటితో 4145 ఎకరాలకు, వేగావతి కుడి ప్రధాన కాలువ ద్వారా 24 క్యూసెక్కుల నీటితో 511 ఎకరాలుకు నీరు సరఫరా అవుతున్నది. పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణ కోసం 28.18 కోట్ల రూపాయలు జపాన్ నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులతో ప్రాజెక్టు ఆధునీకరణ పనులులో భాగంగా సుమారు 1.47 కోట్ల రూపాయల ఖర్చు చేసి 10 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని ఆమె చెప్పారు. ఈ పనిలో భాగముగా కాలువల్లో 27.40 కి మీ కాంక్రీటు లైనింగ్ కు గాను సుమారుగా 2.50 కి.మీ. కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మొత్తం కాంక్రీటు లైనింగ్ పనులు, సి.ఎం డి సి.డి నిర్మాణ పనులు పూర్తి చేయడం వలన చివర ఆయుకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు వై రాజరాజేశ్వరి, కార్య నిర్వాహక ఇంజనీరు ఆర్ అప్పల నాయుడు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైవే రోబరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసిన సిసిఎస్ పోలీసులు

### -విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్ -2023లో పూసపాటిరేగ పిఎస్ లో నమోదైన హైవే రోబరీ కేసులో నిందితులు అరెస్టు -ఇద్దరు నిందితుల నుండి రూ. 17,35,000/-ల నగదు, రూ. 5లక్షల విలువైన బంగారం సీజ్



**విజయనగరం క్రైమ్, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీసు స్టేషను పరిధిలో జాతీయ రహదారిపై 2023సం. మే మాసంలో జరిగిన హైవే రోబరీ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.17.35 లక్షల నగదు, రూ. 5లక్షల విలువైన బంగారు వస్తువులను రికవరీ చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆగస్టు 1న వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - 16వ జాతీయ రహదారిపై పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం పై ఓవర్ బ్రిడ్జిపైన 2023 సం. మే మాసంలో జరిగిన హైవే రోబరీ కేసు జరిగిందన్నారు. ఒడిస్సా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన బియ్యం వ్యాపారి కోట్ల వంశీకృష్ణ అనే వ్యక్తి వ్యాపారుల నుండి వసూలు చేసి, కారులోరూ. 50 లక్షలను తీసుకొని వస్తుండగా, నిందితులు చోడమ్మ అగ్రహారం వద్ద కారును అడ్డగించి, కారం జల్లి, కోట్ల వంశీకృష్ణ నుండి రూ.50 లక్షలు తీసుకొని పరారీకాగా, వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. ఈ కేసులో వంశీకృష్ణ కారు డ్రైవరు ఇచ్చిన సమాచారం మేరకే నిందితులు ఒక బృందంగా ఏర్పడి, దోపిడికి పాల్పడినట్లుగా విచారణలో గతంలోనే వెల్లడయ్యిందన్నారు. ఈ కేసులో కారు డ్రైవరుతో సహా ఆరుగురు నిందితులను గతంలోనే అరెస్టు చేసి, 5.70 లక్షలను రికవరీ చేసామన్నారు. కానీ, ఈ కేసులో ప్రధాన నిందితుడు అయిన పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన రుద్రపంక్తి మధు దోపిడీలో దోచుకున్న డబ్బులో ఎక్కువ మొత్తంను తీసుకొని, పరారీ అయ్యాడన్నారు. అప్పటి నుండి నిందితుడి కోసం సి.సి.ఎస్. పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారన్నారు. సిసిఎస్ పోలీసులు చేసిన కృషి ఫలితంగా పరారీలో ఉన్న నిందితుడు రుద్రపంక్తి మధును కందివలస సంత వద్ద అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుండి రూ. 12.10 లక్షల నగదు, రూ.5 లక్షల విలువైన బంగారు వస్తువులను రికవరీ చేసి, విచారణ చేపట్టారన్నారు. విచారణలో నిందితుడు రుద్రపంక్తి మధు ఇచ్చిన సమాచారం మేరకు దోచుకున్న డబ్బులలో రూ. 5లక్షలు ఖర్చు చేసి బంగారు వస్తువులను కొనుగోలు చేసినట్లు, మిగిలిన సొమ్మును తన జల్సాలకు ఖర్చు చేసినట్లు, ఇంకనూ మిగిలిన సొమ్ముతో భూమి కొనుగోలు చేసేందుకు వెళుతుండగా పోలీసులకు పట్టుబడినట్లు, ఈ నేరం చేసేందుకు తనతో పథకాన్ని రూపొందించినది దారపు గోపాలకృష్ణ అనే లాయరని వెల్లడించారు. నిందితుడు ఇచ్చిన

మిగతా 2లో

# రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

## రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును బీజేపీ జాతీయ నాయకులు, మాజీ రాజ్య సభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు స్వాగతించా రు. ఈ తీర్పు చారిత్రాత్మకమైనదని అందుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి, వర్గీకరణ కోసం సుధీర్ఘ కాలం పాటు పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకి అభినందనలు తెలిపారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై బిజెపి మాజీ పార్లమెంటు సభ్యులు జీవీఎల్ నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోసం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఎస్సీ ఎస్టీలలోని వెనుకబడిన కులాలకు, తెగలకు లబ్ధి జరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ వర్గీకరణను పార్లమెంటులో అనేక సందర్భాలలో తాను ప్రస్తావించి, సమర్ధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, తాజాగా వెలువడిన తీర్పు ఎస్సీ ఉప కులాలయిన మాదిగ, రెల్లి కులాలకు న్యాయం చేస్తుందన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం

మిగతా 2లో


**విలేకరులు కావలెను**

బడుగు, బలహీన వర్గాల ఐక్యతాగళాన్ని 'కలం'తో వినిపిస్తూ..
సంచలన దినపత్రికగా వెలుగొందుతున్న
నేటి దినపత్రిక **సూర్య** లో పనిచేసేందుకు విలేకరులు కావలెను.
ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీగా వున్న మండలాల్లో పనిచేసేందుకు
ఆసక్తి కలిగిన అభ్యర్థులు కావలెను.

**ఖాళీగా వున్న మండలాలు ఇవి...**

గాజువాక, ములగాడ, పెదగంట్యాడ, అగనంపూడి, లంకెలపాలెం, అచ్యుతాపురం, నక్కపల్లి, ఎస్ రాయవరం, మాకవరపాలెం, కొయ్యూరు, నాతవరం, చింతపల్లి

ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంప్రదించాల్సిన నెంబర్లు:
7207720737, 7013546540, 9848238376

**సూర్య** డోర్ నెం. 50-109-4, ఈనాడు పాత కార్యాలయం గేటు ఎదుట రోడ్డు సీతమ్మధార, విశాఖపట్నం- 530013

## కొండవాలు ప్రాంతాలలో శిధిలావస్త ఇళ్లను గుర్తించండి

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శుల పనితీరుపై పర్యవేక్షణ నిర్వహించాలని పెట్టినందుకు ఇంకేం కరెక్షన్ చేశాను జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పిడి యుసిడి ఫణి రామ్, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, జె.విజయలక్ష్మి, ఆర్.జి.వి.కృష్ణ, బి.సన్యాసినాయుడు, హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు సాంసన్ రాజు, రామ్మోహన్ రావు, వేణుగోపాల్, గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, డిసిపిలు, ఏసీపీలు, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకి, ఇచ్చిన మాట ప్రకారం సుప్రీంకోర్టులో వర్గీకరణను తమ ప్రభుత్వం ద్వారా సమర్ధించి సానుకూల తీర్పుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి జీవీఎల్ ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో త్వరలో రెండు తెలుగు రాష్ట్రాలు ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎల్ కోరారు.

## బెల్లం వినాయకునికి మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### బెల్లం దిమ్మలు నైవేద్యంగా సమర్పించిన వంశీ



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విశాఖపట్నంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ బెల్లం వినాయక స్వామిని ఈరోజు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌దర్శించుకున్నారు. జనసేన మహిళా నాయకురాలు పద్మ దంపతుల ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొని, బెల్లం దిమ్మలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా వంశీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో బరువుకు సమానంగా బెల్లం దిమ్మలు సమ ర్పించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ స్వామి వారి దయతో ప్రజ లందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరే టర్, స్థానిక కూటమి వార్డ్ అధ్యక్షులు, కూటమి శ్రేణులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## 371 రోజులు విజయవంతంగా కొనసాగిన 10రూపాయల భోజనాలు



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో, వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ వారు 371 రోజులుగా దూర ప్రాంతాల నుండి వచ్చిన పేషంట్ల సహాయకులకు 10 రూపాయలకే నాణ్యమైన, శుభ్రమైన భోజనాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర (ఉమ్మడి రాష్ట్రాల) చైర్మన్ మక్బుద్ అహ్మద్ గారు మాట్లాడుతూ , మా రౌటేబుల్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, సంస్థ సభ్యుల సహకారంతో గోషా హాస్పిటల్ లో దూర ప్రాంతాల నుండి వస్తున్న పేషంట్ల సహాయకులకు నారాయణ సేవను అందించాలని ఈ భోజనాలను పంపిణీ చేస్తున్నామని తెలియచేశారు. ఈ భోజనం తయారు చేయడానికి 50 రూపాయలు ఖర్చవుతుందని, కేవలం పేషంట్ల సహాయకులకు సేవలందించాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామినీ దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. గురువారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకు న్నారు. భూలోక స్వర్గధామంలా ఉండే తిరుపతి దేవస్థానం ఎన్నిసార్లు స్వామిని దర్శించుకున్నా తనివి తీరనిది అన్నారు. ఏడుకొండలస్వామి చల్లని చూపు, ఆశీస్సులు ఆంధ్ర ప్రజలపై ఎల్లప్పుడూ చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఎస్ఎంసి ఎన్నికలు నిబంధనకు అనుగుణంగా నిర్వహించాలి

### ఎంఈఓ తిరుమలరావు ప్రసాద్



**రామభద్రపురం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఈనెల 8న జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రభుత్వం అనుగుణంగా నిర్వహించాలని ఎంఈఓ ఆమెటి తిరుమల ప్రసాదరావు అన్నారు గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాల వద్ద ఆయా ప్రధాన ఉపాధ్యాయులు ఎన్నికల సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారునీ తెలిపారు 5వ తేదీన ఓటర్లు జాబితా అభ్యంతరాలను తీసుకుని అదే రోజు తుది జాబితాను విడుదల చేస్తామని అన్నారు 8న ఎన్నికలు నిర్వహించి అదే రోజు చైర్మన్ వైస్ చైర్మన్ నెంబర్ తో పాటు ప్రమాణ స్వీకారం చేయించాలని ఆయన అన్నారు ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు

## ఏ కష్టమొచ్చినా.. మేమున్నాం.. అధైర్యంపడొద్దు..!



(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికలతో పాటు ఆగస్టు 30వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా... సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, ముఖ్యనేతలతో జగన్మోహన్‌రెడ్డి కాసేపు మాటామంతీ కలిపారు. కుశల ప్రశ్నలు వేస్తూ... అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వున్న సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, ముఖ్యనేతలతో ఫోటోలు దిగారు.

## హైవే రోబరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసిన సిసిఎస్ పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం మేరకు దారపు గోపాలకృష్ణ అనే లాయరును కూడా అరెస్టు చేసి, అతని వద్ద నుండి రూ.5.25 లక్షలను రికవరీ చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితులు రుద్రపంక్తి మధు, దారపు గోపాలకృష్ణ పథక రచన చేసి ఎక్కువ మొత్తంలో నగదు తీసుకొని విశాఖపట్నం నుండి పర్లాకిమిడి వచ్చే కోట్ల వంశీకృష్ణ వద్ద నుండి డబ్బులు దోచుకోవాలని భావించి, రోబరీకి పాల్పడినట్లు, దోచుకున్న మొత్తంలో సహాయపడిన నిందితులకు రూ.10 లక్షలను పంచి, చెరో రూ. 20 లక్షలు తీసుకొని పరారైనట్లుగా వెల్లడించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో ఎంతో శ్రమించి, ప్రధాన నిందితులన అరెస్టు చేయుటలో ప్రతిభ కనబర్చిన విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, ఎస్ఐ బి. భాగ్యం, ఎఎస్ఐ ఎ. గౌరీ శంకర్, హెడ్ కానిస్టేబుళ్ళు ఎం.రామకృష్ణారావు, డి. శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గారు అభినందించి, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఎ.సత్యన్నారాయణ, ఎస్బి సిఐ ఈ. నర్సింహమూర్తి, సిసిఎస్ ఎస్ఐ బి.భాగ్యం మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యలమంచిలి కూటమిలో కుమ్ములాటలు

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. అయితే రెండు నెలలు కాక ముందే తమను తొక్కేస్తున్నారని టీడీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. జనసేన నేతలు, నాయకులు గ్రామాల్లో రెచ్చిపోతున్నారని నునపర్తికి చెందిన టీడీపీ నాయకులు ఏకంగా పప్పల చలపతిరావుకు, ప్రగడ నాగేశ్వరరావుకు ఫిర్యాదు. చేయడం గమనార్హం. నునపర్తిలో సుమారు రెండు ఎకరాల కొండ పోరంబోకు భూమిని రజకులు దశాబ్దాల కాలంగా బట్టలు ఉతుక్కొంటూ జీవనం సాగించేవారని, ఇప్పుడు సదరు భూమిని సర్పంచ్ అనురాధ తనదంటూ యంత్రాలతో చదును చేస్తుండగా అడ్డుకోవడం జరిగిందని టీడీపీ నేతలు తమ పార్టీ ముఖ్య నాయకులకు ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీ సీఎం రమేష్ కు సైతం ఫిర్యాదు చేయడం జరిగిందని నునపర్తి టీడీపీ నేత రెడ్డి అప్పారావు తదితరులు విలేకరులకు తెలిపారు. తమతో పాటు పలు గ్రామాల్లో జనసేన అభ్యర్థి గెలుపునకు లక్షలు రూపాయలు ఖర్చు చేశామని, తీరా అధికారంలోకి వచ్చాక తమకు చుక్కలు చూపిస్తున్నారంటూ వారంతా మండిపడుతున్నారు. రాంబిల్లి, యలమంచిలి, అచ్యుతాపురం మండలాల్లో జనసేన హవా ఒక రేంజ్ లో ఉంది. రాంబిల్లి మండలం గోకివాడకు చెందిన టీడీపీ ముఖ్యనేత నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే తీరు కారణంగానే యలమంచిలి నియోజకవర్గంలో టీడీపీ భూ స్థాపితం అయిపోయేలా ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ లేకపోతే జనసేన గెలుపు సాధ్యమవునా.. అంటూ తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**టీడీపీ అధిష్టానం ఆరా...**

నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు, మంత్రి లోకేష్ సీరియస్ అయినట్లు యలమంచిలి నియోజకవర్గ ముఖ్య నేత తెలిపారు.

నేడో, రేపో దీనిపై క్లారిటీ వస్తుందని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఆందోళనలు చెందవద్దని ఆయన సూచించారు. జనసేన ఎమ్మెల్యే రెండు నెలల ప్రగతి, ఆయన వ్యవహార శైలి, నియోజకవర్గంలో చోటుచేసుకున్న వివాదాలు , ముఖ్యంగా జర్నలిస్టు నేతలపై సుందరపు వ్యవహరించిన తీరు, బెదిరింపులకు దిగిన వ్యవహారాలను సైతం తాము తమ అధినాయకత్వానికి వివరించినట్లు సదరు టీడీపీ ముఖ్య నేత పేర్కొన్నారు.

## 'స్థానిక' ఎమ్మెల్సీ సీటు కోసం.. వ్యూహాత్మకంగా వైసీపీ అడుగులు!

(మొదటి పేజీ తరువాయి)

అమర్‌నాథ్‌ను బరిలోకి దింపాలా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. బూడి ముత్యాలనాయుడు అయితే.. గ్రామీణ ప్రాంతంలో పట్టు వుంటోందని, గుడివాడ అమర్‌నాథ్ అయితే కొత్త విశాఖ జిల్లాలో పట్టు వుందనే అంశంపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల కోటా కింద జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీలు కీలక పాత్ర వహించనున్నారు. అత్యధికులతో బూడి ముత్యాలనాయుడుకు పరిచయాలున్నాయి. మరోపక్క కొంతవరకు వీరితో కూడా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కూడా పరిచయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరువురిలో ఎవర్ని పోటీకి నిలపాలనేది త్వరలో తేలనున్నట్టు తెలుస్తోంది. మరోపక్క టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జిని బరిలోకి దింపాలనే యోచనలో వున్నట్టు తెలుస్తోంది.

**వైసీపీదే ఆధిక్యత**

ఎమ్మెల్సీ ఎన్నికలో జీవీఎంసీ కార్పొరేటర్లు, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం ఓట్లు 841 ఉండగా.. అందులో వైసీపీ బలం 615 ఉంది.. టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులకు కేవలం 215 ఓట్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే 11 స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వలసలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే కొంతమంది ఎంపీటీసీలతో పట్టు జడ్పీటీసీలను కూడా కూటమి పార్టీల్లో చేర్చుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే జీవీఎంసీలో 12 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో దాదాపు చేరిపోయారు.

**ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'కూటమి'**

స్థానిక సంస్థల కోటా నుంచి జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను టీడీపీ, జనసేన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎమ్మెల్సీ సీటు కైవసం చేసుకోవాలనే యోచనకు పదునుపెట్టింది. మరోపక్క ...విశాఖ స్థానిక సంస్థల కోటాలో మాత్రం వైసీపీకి ఆధిక్యత ఎక్కువగా ఉండటంతో..కూటమి ఈ సీటు గెలుచుకు నేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తోంది. స్థానిక సంస్థల్లో ఓటర్లుగా ఉన్న వారిని తమ వైపు తిప్పుకొనేందుకు కూటమి పార్టీల స్థానిక నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేసారు. మరోపక్క కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలందరూ తమతోనే ఉండేలా వైసీపీ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

## ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటి పెంచుదాం

- దేశీయ విత్తనాలతో కూరగాయలు ఆకుకూరలు పెంచుతున్నాం
- జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా చేపట్టాం
- వి ఎస్ కృష్ణా కాలేజ్ లో ఒక అరుదైన జీవవైవిధ్య వనాన్ని పెంచుతున్నాం
- డాక్టర్ ఐ విజయబాబు, ప్రిన్సిపాల్, వి ఎస్ కృష్ణా కాలేజ్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, పక్షులు గూళ్ళు పెట్టుకునే మొక్కలు, దేశీయ కూరగాయలు, ఆకుకూరలు మొక్కలు నాటి పెంచుదాం అని వి ఎస్ కృష్ణా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ విజయబాబు, . ఈ మేరకు గురువారం ఉదయం వి ఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కృషి చెయ్యాలి అని కోరారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి ఆధారిత వ్యవసాయం ఎంతో అవసరం అన్నారు. అందుకే తమ విద్యా సంస్థలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ, వనమాలి ఎన్జీవో ల సహకారం తో వనాలు పెంచుదాం అని, దేశీయ విత్తన నిధి ఏర్పాటు చేస్తాం అన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా చేపట్టాం,

ఒక అరుదైన జీవవైవిధ్య వనాన్ని పెంచుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వనమాలి సంస్థ ప్రతినిధులు మళ్ళా సరిత, ఎ అరుణ, వి ఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై జయ, టీచింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ బి చంద్రమౌళి, డాక్టర్ పి స్వామి నాయుడు, డాక్టర్ వి పద్మజ, డాక్టర్ ఎం హెచ్ ఇ పుష్పాలత, డాక్టర్ జిఆర్ఎన్ఎస్ సుజాత గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, పలువురు విద్యార్థులు మాట్లాడారు.

## శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో జలుమూరు తహశీల్దార్

**జలుమూరు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** జలుమూరు తహశీల్దార్ లక్ష్మీనారాయణ గురువారం శ ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించే ముందు స్వామివారిని దర్శించుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. ఇ సందర్బంగా అయనకు స్థానిక అర్చకులు ఆలయ విశేషతని తెలియజేశారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనాథరం మండలం మ్రో కార్యాలయంలో బాధ్యాతలు స్వీకరించారు.



## లక్ష వినాయక ప్రతిమలతో పర్యావరణహిత వినాయక చవితి

-విశాఖలో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసే పోటీ నిర్వహిస్తాము -విశాఖ మహానగరంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపేట -ప్రతి ఒక్కరు స్పందించండి వినాయక ఎగ్జిబిషన్ను జయప్రదం చేయండి -జలగం కుమారస్వామి, జాతీయ కార్యవర్గ సభ్యులు, భారత కిసాన్ సంఘ్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** లక్ష వినాయక ప్రతిమలతో పర్యావరణహిత వినాయక చవితిని విశాఖ మహానగరంలో చేద్దామని భారత కిసాన్ సంఘ్ జలగం కుమారస్వామి నిర్వహిస్తామన్నారు. శివాజీ పాలెం లోని ప్రకృతి ఆధారిత రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసే పోటీ నిర్వహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్పందించి వినాయక ఎగ్జిబిషన్ను జయప్రదం చేయాలని కోరారు. విశాఖ మహానగరంలో ఇప్పటికే చాలామంది పెద్ద పెద్ద మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు అలాంటి వాళ్ళందరిని కలుపుకుని ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేకాక విద్యార్థులను, మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయడానికి ఇష్టపడే వారిని ఒక చోటకు తీసుకువచ్చి మట్టి ఏర్పాటు చేసి ఎవరికి వారుగా మట్టి వినాయక తయారు చేసే పోటీ నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి ఆధారిత వ్యవసాయదారుల సంగం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రమణ్యం వర్మ, సంస్థ కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్ , వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్, జల శక్తి మిషన్ విశ్రాంత అధికారి కృష్ణ, ఆంధ్రా యూనివర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ రంగాచార్యులు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## స్వప్రయోజనాలకే పీఠం వేసే వైపీసీ పీడ విరగడయ్యింది..!

### బాబు పరిపాలన - రాష్ట్ర పురోగతి సదస్సులో ఎమ్మెల్యే వంశీ



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** స్వప్రయోజనాలకే పెద్ద పీఠ వేసే వైసీపీ ప్రభుత్వ పీడ విరగడయ్యిందని దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దసపల్లా హోటల్‌లో గురువారం బాబు పరిపాలన – రాష్ట్ర పురోగతి అనే అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అభివృద్దిని తుంగలో తొక్కి, స్వప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రజలకు అనుకూలంగా పరిపాలన చేయాలని, లేదంటే అధోగతి తప్పదని , ప్రజలకు మంచి పాలన అందించాలని దీనికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ పాలన అద్భుతంగా ఉందని కొనియాడారు. రానున్న రోజుల్లో అనేక నూతన సంస్కరణలు చేస్తారని, ప్రజల అభివృదే ధ్యేయంగా కూటమి పనిచేస్తుందని హామీనిచ్చారు. గతంలో వైసిపి పరిపాలనతో విసిగి పోయిన ప్రజలు తెలుగుదేశం– జనసేన – బిజెపి కూటమి కి జై కొట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తి అయిన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసిన రామ్‌ని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దాడి వీరభద్ర రావు, మేధావులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



**బొబ్బిలి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** బొబ్బిలి శివాలయం వీధి వద్ద, మొమ్మిల మణికంఠ అనే,12 సంవత్సరాల అబ్బాయి తలపై నుంచి హెవీ లారీ వెళ్లిపోవడంతో, సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచిపెట్టడం జరిగింది. ప్రధానంగా పారాది బ్రిడ్జి రిపేర్ వల్ల హెవీ వాహనాలు బొబ్బిలి వీధుల్లోంచి రావడంతో చాలా భయంకరమైన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా అన్ని రోడ్లు కూడా పూర్తిగా వర్షానికి శిథిలమై పోవడంతో,ప్రజలందరూ ప్రాణాలు చేతులు పెట్టుకుని బతుకుతున్నారు. ఈ సంఘటన పట్ల కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం తక్షణమే యుద్ధప్రాతిపదికన బొబ్బిలి ప్రధాన రహదారులన్నీ బాగు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లి బాబు హర్షం



**చోడవరం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఎస్సీ ఏ.బి.సి.డి వర్గీకరణ పై గురువా రం సుప్రీంకోర్టులో తీర్పు ఇవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎలక మల్లి బాబు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ కుల వర్గీకరణ పై మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందని, దీనివలన పేద వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేడు దేవరాపల్లి మండల సమావేశం



**దేవరాపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** దేవరాపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం (నేడు ) జరుగుతుందని ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్. అప్పలరాజు తెలిపారు. నూతన మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకి ఈ సమావేశం ప్రారంభంకానుందని తెలిపారు. జడ్పీటీసీ తో పాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు ఈ సమావేశంనకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. అదేవిధంగా వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ



**తగరపువలస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పాఠశాల నిర్వహణ కమిటీ లకు ఈరోజు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని, జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, మండల విద్యాశాఖాధికారుణులు 1 అండ్ 2 ఎం.శివరాణి, ఏ.జయప్రదల ఆదేశాల మేరకు జి.వి.యం. సి. ప్రాథమిక పాఠశాల, బంగ్లామెట్ట నందు అసెంబ్లీ సమావేశంలో విద్యార్థులకు ఎన్నికల నోటిఫికేషన్ గురించి తెలియపరచడమే కాకుండా గురువారం ఉదయం 10 గంటలకు నోటీస్ బోర్డ్ లో నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రదర్శించామని, అలాగే రెండు గంటలకు ఓటర్ల లిస్టు ప్రదర్శించామని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వారా తెలియజేయడమే కాకుండా ఐదవ తేదీన ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని తెలియపరిచామని, అదేవిధంగా ఐదవ తేదీ సాయంత్రం ఓటర్ల తుది జాబితా ప్రదర్శించి 8వ తేదీన చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎన్నిక మరియు ప్రమాణ స్వీకారం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటికి నాగమణి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చైల్డ్ లేబర్ డ్రైవ్



**అనకాపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ ఐ రాములమ్మ తెలిపారు. పాన్ ఇండియా ( నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ఎన్సీపీసీఆర్) %ఽ%( స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ఎస్సీ,పిసిఆర్ )వారి ఆదేశాల ప్రకారం చైల్డ్ లేబర్ డ్రైవ్ అండ్ రిహాబిటేషన్ లో భాగంగా కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. చైల్డ్ లేబర్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, రెవిన్యూ డిపార్ట్మెంట్, డిస్టిక్ పంచాయతీ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో గల అన్ని హొటల్స్, చేగోడీలు తయారీ, కంపెనీస్, మెకానిక్ షెడ్స్, వస్త్ర దుకాణాలలో చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు.

## జగనన్నను కలసిన భరత్ కుమార్



**అనకాపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్, అనకాపల్లి జీవీఎంసి కార్పొరేటర్లు 82 వ వార్డు మందపాటి జానకిరామరాజు - సునీత, 81వ వార్డు పీలా రాంబాబు - సౌజన్య, 83 వ వార్డు జాజుల రమేష్ - ప్రసన్న లక్ష్మి, కశింకోట మండలం నాయకులు మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, భరత్ కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజా తదితరులు గురువారం కలిశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై వైయస్ జగన్మోహన్ రెడ్డి పలు సూచనలు చేశారని, నియోజకవర్గంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా చెప్పారని భరత్ కుమార్ తెలియజేసారు.

## అనాధులకు రిలయన్స్ స్మార్ట్ చేయూత




**ఆరిలోవ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 10 వ వార్డు, పాత డైరీ ఫార్మ్ వద్ద ఉన్న రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్ ఇందిరా నగర్ లో ఉన్న ఆనంద మార్గ చిల్డ్రన్ హోమ్( అమృత్ శాఖ) అనాధలకు 15 వేల రూపాయలు విలువచేసే నిత్యవసర వస్తువులను గురువారం అందజేశారు. 50 కిలోల బియ్యం, వంటనూనె, పప్పు దినుసులు, సబ్బులు, గోధుమపిండి , పంచదార వంటి వివిధ వంటకు ఉపయోగపడే దినవారి వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద మార్గ చిల్డ్రన్ హోమ్ కమిటి సభ్యులు సౌమ్యానంద అవధూత, ఆర్ .ఎ .పాత్రో రిలయన్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జగన్ అరాచక పాలనపై ఐదేళ్లు యుద్ధం చేశా

### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** వైసిపి అరాచక పాలనలో ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రం అన్ని రంగాలలోనూ భ్రష్టు పట్టిపోయిందని.. ఆ దుర్మార్గపు పాలనను అంతం చేసేందుకు తనవంతుగా రాజీలేని పోరాటం చేశానని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తయిన సందర్భంగా " బాబు పాలన - రాష్ట్ర పురోగతి " అంశం పై సదస్సు నిర్వహించారు. తెలుగు శక్తి ఆధ్వర్యంలో నగరంలోని హొటల దసపల్లాల్లో ఏర్పాటు చేసిన సదస్సు సందర్భంగా.. బి.వి.రామ్ మాట్లాడుతూ.. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి సర్కారు పై నిరంతరం ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం కొనసాగించానని అన్నారు. జగన్ అరాచక పాలనను కేవలం విశాఖలోనే కాకుండా వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలోను, దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఎండగట్టానన్నారు. ఈ పోరాటం తన కోసం చేయలేదని.. తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం చేశానని ప్రస్తావించారు. ఈ క్రమంలోనే యువత మరింత చైతన్యవంతులై రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కదిలి రావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే కాదు ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలని తన ఆకాంక్ష అని బి.వి.రామ్ ఈ సందర్భంగా తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రం అన్ని రంగాలలోనూ మంచి పురోగతిని సాధిస్తుందని రామ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పారిశ్రామికవేత్తలు, యువత, ప్రజలు హాజరయ్యారు.

# దేవాదాయ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### పోస్టర్ ఆవిష్కరించిన సీపీఎం నాయకులు




**అనకాపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పూల్ బాగ్ రోడ్ దేవస్థానానికి చెందిన సుమారు 11 వందల కోట్లు విలువైన దేవాదాయ భూములను పరిరక్షించాలని కోరుతూ గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్‌లు పోస్టరావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు ఆ భూములకు సంబంధించిన వీలునామా, కోర్టు జడ్జిమెంట్, ప్రభుత్వ గెజిట్‌ను ప్రదర్శించడం జరిగింది. వీటి ద్వారా ఈ భూములు శ్రీ సీతారామచంద్ర మూర్తి దేవస్థానంకు చెందినవిగానే వున్నాయన్నారు. ఆర్డీఓ జడ్జిమెంట్ కూడా వీటిని ధృవీకరించిందన్నారు. కాని కొణతాల రజిని కొంత మంది కలిసి ఈ భూములను కాజేయాలని కుట్రపూరితంగా కొన్ని తప్పుడు పత్రాలను నోటరీ ద్వారా వ్రాయించుకొని తమ భూములుగా హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చిందని ఆ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించే ప్రయత్నాలను సిపిఎం పార్టీ ఖండిస్తుందన్నారు. ఇలాంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తోందని అన్నారు . దీనిపై స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపి సిఎం రమేష్‌లు ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అవినీతిపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి ఆక్రమణలపైన, భూకబ్జాలపైన చర్చ జరుగుతున్న సమయంలో, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే కోట్లాది రూపాయలు విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నట్లుగా సిపిఎం భావిస్తుందని అన్నారు. 2007లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున జరిగిన భూ పోరాటాల్లో భాగంగా ఈ భూముల్లో సిపిఎం పార్టీ జెండాలను పాతి ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరిందన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పై కేసులు పెట్టడంతో పాటు ఇవి దేవాదాయ భూములను కాబట్టి ఇవి ఎవరికీ చెందవని ప్రభుత్వం వారు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో నేడు ప్రైవేటు వ్యక్తులు వచ్చి ప్రోక్లైన్‌తో భూమిని చదును చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం ఏమిచేస్తుందని ప్రశ్నించారు. ఈ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధం కావల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, మండల నాయకులు కాళ్ళ తెల్లయ్యబాబు, నాగిరెడ్డి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రప్రజలకు ప్రభుత్వం డబుల్ ధమాకా

### హర్షం వ్యక్తం చేసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు డబుల్ ధమాకా ప్రకటించారని దీనిపై ప్రజలందరూ పూర్తిస్థాయి సంతోషంగా ఉన్నారని భీమిలి జోన్ 3వ వార్డు అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. సంచలనాలకు మారుపేరైన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. అనేకరకాలైన పాలసీలను తీసుకువచ్చి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్క కుటుంబానికి సొంత ఇళ్ళు ఉండాలన్న లక్ష్యంతో నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. పట్టణాల్లో ఉండే వారికి రెండు సెంట్లు, పంచాయతీల్లో నివాసం ఉండేవారికి మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలన్న ఆలోచన శుభపరిణామమని అన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణానిక నాలుగు లక్షలు ఇవ్వాలని కేబినెట్ ఆమోదం చెప్పడం ఎంత దీర్ఘకాలిక ఆలోచనలతో, ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలన్న ఆలోచనతో అడుగులు వేస్తున్నారో అర్థం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో బకాయి ఉన్న గృహ బకాయిలను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడం రాష్ట్ర ప్రజలకు డబుల్ ధమాకా ఇచ్చినట్లేనని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గంటా నూకరాజు కోరారు.

# ఏలేరు కాలవకు ఫార్మా వ్యర్థ రసాయనాల ముప్పు

### ఏలేరు కాలువ సమీపంలోకి ఫార్మా వ్యర్థాలు వచ్చినట్లు గుర్తించిన స్థానికులు

**పరవాడ, ఆగస్ట్ 1, మేజర్‌న్యూస్:** మండలంలో జవహర్లాల్ నెహ్రూ ఫార్మసిటీలో వ్యర్థచరాలు సమీపంలోని ఏలేరు కాలంలోనికి కలిసి అవకాశం ఉందని స్థానికుడు గురువారం గుర్తించారు ఫార్మా వ్యక్త రసాయనాలు రావడానికి గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం తాడి గ్రామానికి సమీపంలో రాంకీ పంప్ హౌస్ పక్కన ఫార్మా పరిశ్రమలకు చెందిన వ్యర్థ రసాయన వ్యర్థ జలాలు ఏలేరు కాలువ వైపు రావడాన్ని గమనించిన తాడి గ్రామస్తులు ఇప్పటికే తమ గ్రామంలో భూగర్భజలాలు ఫార్మా కాలుష్యంతో కలుషితం అయిపోయాయని ఇప్పుడు విశాఖపట్నం దాహార్తిని తీర్చుతున్న ఏలేరు కాలవలోనికి ఫార్మా వ్యర్థచరాలు కలిస్తే మంచినీరు కాస్త ఫార్మా వ్యర్థాలతో నిండిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ వ్యర్థ జలాలు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని తాడి గ్రామ యువజన సంఘం సభ్యులతో కలిసి పరిశీలించారు .అనంతరం గని శెట్టి మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనాలు ఇప్పటికీ పరవాడ పెద్ద చెరువు, ఊర చెరువు, మొల్లేడుగడ్డ, తాడి సమీపంలో కాలువలు వ్యర్థ జలాలు విడుదల చేయడం వలన తీవ్ర కాలుష్యం తో ప్రజల అల్లాడుతున్నారని దీనికి తోడు విశాఖపట్నం కి వెళుతున్న మంచినీటి ఏలేరు కాలువలో ఈ జలాలు కలవడానికి అవకాశం ఎక్కువగా ఉందని ఇప్పటికే ఏలేరు కాలువకి పది మీటర్లు సమీపంలో జలాల ప్రవహిస్తున్నా యని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాంకీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గల్లా భార్గవ్, సాలాపు భాస్కర్, కోమటి గురుమూర్తి, శ్రీను,బాలాజీతదితరులు పాల్గొన్నారు.



# సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** లరాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్.టి.ఆర్ భరోసా పింఛను పథకంలో భాగంగా నిరుపేద వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులకు సామాజిక పింఛన్లను అందించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 5వ జోన్ 41వ వార్డు పోస్ట్ ఆఫీస్ వీధి సెబాస్టియన్ కాలనీ లోని సచివాలయం నెంబర్ 1086319 పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీన ఎన్.టి.ఆర్ భరోసా పథకం లో భాగంగా సామాజిక ఫించన్లను, నిరుపేద వృద్ధులు,

వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులకు ఈ పథకం ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జ్ఞానాపురంలోనే ఎర్రిగెడ్డను పరిశీలించి కాలువలో పూడికలు ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని, జ్ఞానపురం చుట్టుపక్కల నుండి వర్షపునీరు ప్రధాన ఘాట్ లో చేరుతున్నందున కాలువలు పొంగి చుట్టుపక్కల నివాసిత ప్రాంతాలకు నీరు చేరుతున్నందున దానికి శాశ్వత పరిష్కారం కొరకు చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాలరావును ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు విరివిగా పడుతున్నందున స్టాప్ డయోరియా క్యాంపెయిన్, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, అలాగే దోమల వృద్ధి చెందకుండా అవగాహన సదస్సులు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్ ను ఆదేశించారు. ఈ పర్యటనలో 5వ జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్యరాజు, ఏఎంఒహెచ్ డా.సునీల్ కుమార్, ఏసిపి వెంకట్రావు, ఏపీడి పద్మావతి, రెవెన్యూ ఆఫీసర్ బాబురావు, సచివాలయ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### -వేడుకల నిర్వహణకు అన్ని విభాగాల అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి
### -చిత్తశుద్ధితో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలి
### -సమన్వయ కమిటీ ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఆగస్టు 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించతలపెట్టిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఆ మేరకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం ఉదయం జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలని హితవు పలికారు. అవార్డుకు గౌరవం పెరిగే విధంగా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని మాత్రమే గుర్తించి పేర్లను ఈ నెల 5వ తేదీలోగా పంపించాలని సూచించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలను నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. ఏటా జరుపుకునే తరహాలోనే పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడతామని ఆ మేరకు ఆయా విభాగాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నగరంలోని పోలీస్ మైదానంలో ఆగస్టు 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. స్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా సరిచూసుకోని ఏర్పాట్లు చేసుకోవాలని హితవు పలికారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్ నెస్ చెక్ చేసుకోవాలన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని చెప్పారు. పోలీసు, ఎన్.సి.సి. విభాగాల వారు గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించాలని, సమన్వయం చేసుకోవాలని సూచించారు. వేడుకులకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఈ నెల 5వ తేదీలోగా పంపించాలని చెప్పారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావొచ్చని ఆ మేరకు సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన ఇన్ ఛార్జి మంత్రి వర్యుల చేతుల మీదుగా పతాక ఆవిష్కరణ జరుగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇన్చార్జి డీఆర్వో టి. సీతారామ మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏడీసీపీ నారాయణరావు, ఏసీపీ ప్రభాకర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మి ప్రియాంక



**భీమునిపట్నం, ఆగష్టు 1, మేజర్‌న్యూస్:** తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నివాసంలో విశాఖపట్నం జీవీఎంసీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన జీవీఎంసీ 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి తో ప్రియాంక మాట్లాడుతూ మీ హయాంలో కొన్ని కోట్ల రూపాయలతో 6వ వార్డులో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మన పార్టీ అధికారంలోకి వస్తుందని అందరూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

## జూదరుల ఆటకట్టించిన కొయ్యూరు పోలీసులు

**కొయ్యూరు, ఆగష్టు 1, మేజర్‌న్యూస్:** కొయ్యూరు మండల పరిధిలోగల కొండసంత గ్రామం దగ్గర కొంతమంది వ్యక్తులు చిత్తులాట ఆడుతున్నారన్న ఖచ్చితమైన సమాచారం మేరకు బుధవారం నాడు కొయ్యూరు సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్సై రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి రైడ్ నిర్వహించగా చిత్తులాట ఆడుతున్న 12 మంది ని అరెస్టు చేసి తొమ్మిది బైకులను సీజ్ చేసి 23,092/- నగదును స్వాధీన పరుచుకోగా, 11 మంది తప్పించుకుపోయారని వారిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా పోలీసు వారు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# తల్లిపాలు పిల్లలకు వరం

### రెయిన్బో ఆసుపత్రి వైద్య నిపుణులు



ఆరిలోవ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్: పుట్టిన పిల్లలకు కనీసం ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, దీనివలన పిల్లలకి ఎంతో మేలు చేస్తుంతుందని ఆరిలోవ రెయిన్బో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ దినోత్సవం పురస్కరించుకొని ఆస్పత్రిలో వారం రోజులపాటు మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ ఫీడింగ్ పై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా గురువారం రెయిన్బో యాజమాన్యం, వైద్య బృందం పోస్టర్ విడుదల చేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2020-25 నాటికి పిల్లలకు విధిగా ఆరు నెలల పాటు తల్లిపాలు ఇచ్చే వారి సంఖ్య 50 శాతానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పిల్లలకు విధిగా తల్లిపాలు ఇవ్వడం వలన వారి లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రెయిన్బో వైద్యులు డాక్టర్ సిహెచ్ రాగసుధ, డాక్టర్ ఎం వి ఆర్ శైలజ, డాక్టర్ నిహారిక అల్లు, డాక్టర్ శ్రీలత పులి, డాక్టర్ నలిని ఎస్ ఆస్పత్రి నిర్వాహకులు రావి శ్రీనివాసరావు, యూనిట్ హెడ్ పద్మ కుమార్, డాక్టర్ దిలీప్, మనోజ్ రెడ్డి, సత్యసాగర్ పాల్గొన్నారు.

### అనకాపల్లి జిల్లాలో రికార్డు స్థాయిలో

# సామాజిక పెన్షన్ల పంపిణీ

**అనకాపల్లి ప్రతినిధి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఎన్టీఆర్ భరోసా పథకం క్రింద జిల్లాలో అనకాపల్లి మండలం, గోపాలపురం సచివాలయ పరిధిలోగల పీతా రామలక్ష్మికి వితంతు పెన్షన్ రూ.4,000ను గురువారం ఉదయం 6-00 గంటలకే జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్వయంగా పంపిణీ చేశారు.జిల్లాలో సామాజిక పింఛన్లను పింఛను దారులకు ఇళ్ళవద్దే ఉదయం 6-00 గంటల నుండి సాయంత్రం 6:30 గంటలకు 97 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచిదేవి, ఎంపీడీవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కంటి శుక్లాలు అశ్రద్ధ చేస్తే అంధత్వం కలుగును

### ఎల్. వి ప్రసాద్ హాస్పిటల్ డాక్టర్.శిల్ప తరణి



**ఆరిలోవ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా అంధత్వానికి కంటిశుక్లం ఒక ప్రధాన కారణమణి డాక్టర్. శిల్పతరిణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శస్త్ర చికిత్స ద్వారా కంటిశుక్లం వల్ల వచ్చే అంధత్వాన్ని నివారిం చవచ్చు అని వయసు సంబంధిత మార్పుల వల్ల మధుమేహం, మూత్రపిండ వ్యాధి, గ్లాకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్లు, కంటి లోపల మంట, ధూమపానం వంటి వాటి కారణంగా శుక్లాలు ప్రధానంగా కంటిలో అభివృద్ధికి దోహదం చేస్తా యి. ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కార్నియాలో స్పెషలైజేషన్ చేసిన నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శిల్ప తరిణి కంటి శుక్లం ఒక హెచ్చరికగా గుర్తించాలని అన్నారు. దానిని నిర్ధారించుటకు, సమస్యను పరిష్కరించుటకు అనుభవజ్ఞుడైన ఒక నేత్ర వైద్యుని ద్వారా కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకోవటం అవసరమని ఆమె చెప్పారు. అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులు మాత్రమే శస్త్రచికిత్స సమయంలో తలెత్తే అన్ని సమస్యలను ఎదుర్కోగలుగుతారని శస్త్రచికిత్స అనంతర సంరక్షణ ప్రధానమని ఆమె పేర్కొన్నారు.

### నేడు జివిఎంసి 2,3,4,5,8 జోన్లలో

## పలు ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం

**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** జివియంసి నరవ నీటి శుద్ధి కేంద్రము నందు ఉదయం 09.00 నుండి మధ్యాహ్నం 02.00 గంటల వ్యవధిలో 11 33 విద్యుత్ మరమ్మత్తులు నిమిత్తం తే.02.08.2024 దిన (శుక్రవారం) నీటి సరఫరాకు పంపింగు అంతరాయం కలుగుట వలన మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఆ సమయములో ఈ దిగువ తెలిపిన ప్రాంతములకు మంచి నీటి సరఫరాకు అంతరాయము కలుగునని జివిఎంసి కార్య నిర్వాహక ఇంజనీరు (నీటి సరఫరా) ఎస్.శేఖర్ పత్రికా ప్రకటన ద్వారా గురువారం తెలిపారు.

జోన్-2 నందు 8 నుంచి 11 వార్డులలో అరిలోవ తాటిచెట్లపాలెం మొదలగు ప్రాంతములు.

జోన్-3 నందు 12 నుంచి 27 వార్డులలో ఓల్డ్ వెంకోజిపాలెం మొదలగు ప్రాంతములు:

జోన్-4 నందు 28 నుంచి 39 వార్డులలో దన్నల్ల హిల్స్ సాలిపేట, అల్లిపురం మొదలగు ప్రాంతములు.

జోన్-5 నందు 41 నుంచి 57 వార్డులలో రైల్వే న్యూ కాలనీ, అక్కయ్యపాలెం మొదలగు ప్రాంతములు.

జోన్-8 నందు శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంత పార్క్, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్.ఆర్.వి.పురం రజక కాలనీ మొదలగునవి. కావున ప్రజలకు త్రాగునీటికి కలుగు అసౌకర్యానికి చింతిస్తూ మంచినీటి సరఫరా విభాగము, జి.వి.ఎం.సి వారికి నగర ప్రజలు సహకరించవలసినదిగా కమీషనరు వారి తరపున కోరారు. అత్యవసరం అయిన ప్రదేశములలో నీటి ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేయడం జరుగునని తెలిపారు. నీటి ట్యాంకరు ద్వారా నీరు కావలసిన నగర ప్రజలు టి.ఎస్.ఆర్. 8297652049, బ్లాక్-7 (9494915740), ఎండాడ (6309860485), బ్లాక్-22 (9848308813) సహాయక ఇంజనీర్ల ఫోన్ నెంబర్లకు సంప్రదించవలసినదని తెలిపారు.

## డోర్ టూ డోర్ పెన్షన్ పంపిణీలో
# ఎంపీడీవో లాలం సీతయ్య



**కొయ్యూరు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** కొయ్యూరు మండలం అంతాడ మరియు బంగారం పేట గ్రామపంచాయతీలలో ఆగస్టు 1న 99%పెన్షన్ పూర్తి చేయాలి అని గురువారం ఉదయం నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కానుకను సచివాలయ సిబ్బందితోపాటు ఎంపీడీవో లాలం సీతయ్య పాల్గొన్నారు. తదుపరి బంగారంపేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను పలు సబ్జెక్టులలో క్వశ్చన్స్ అడిగి వారి యొక్క ప్రావీణ్యాన్ని పరీక్షించారు. అలాగే బంగారంపేట గ్రామ సచివాలయం సందర్శించి రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలను సచివాలయ సిబ్బందికి ఇవ్వడం ఇచ్చారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో
## పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష
## సచివాలయ సిబ్బంది



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మరియు పలాస మండలం రెంటికోట లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న పలాస నియోజకవర్గ తొలి శాస న సభ్యురాలు గౌతు శిరీష ఎమ్మెల్యే మరియు మండల మున్సిపాలిటీ ముఖ్య నా యకులు గురువారం ఉదయం నుండి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చెయ్య డం జరిగింది మరియు మందస లో సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు ఉదయం నుండి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చెయ్యడం జరిగింది

## ఘనంగా దగ్గుపల్లి సాయి బాబా జన్మదిన వేడుకలు



**పాయకరావుపేట, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** వైసిపి అనకాపల్లి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయి బాబా జన్మదిన వేడుకలు పాయకరావుపేట లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గుపల్లి సా యి తనయుడు దగ్గుపల్లి సాయి తేజ మరియు మనవడు ధృవ్ విహాన్ వైసీపీ నా యకులు, అభిమానులు, కార్యకర్తలు సమక్షంలో ఆయన కార్యాలయంలో అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో బర్తడే కేక్ ను కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు,పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, కొప్పిశెట్టి రామ్మోహన్,సుందర లత, జొన్న కూటి సూరి,పిరాది రాజు, అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబర్ దోమాడ సుందర్రావు, కేశనకుర్తి సత్తిబాబు,గుల్ల నాగు,తుమ్మలపల్లి సతీష్, దనిశెట్టి తులసి తదితరులు పాల్గొని దగ్గుపల్లి సాయిబాబా కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# అనారోగ్యంతో ఆటో డ్రైవర్ మృతి

**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం మందస మండలం చిక్కిడిగం గ్రామానికి చెందిన దుంకురు ముంగలాకి మూడో కుమారుడైన దుంకూరు కిషోర్ (టుటు) 46 మందసలో ఆటో నడుపుతూ కుటుంబానికి పోషించేవాడు గత వారం రోజులుగా అనారోగ్యం కారణంగా ఈరోజు గురువారం మృతి చెందాడు విషయం తెలుసుకున్న మందస మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లు స్వచ్ఛంద సేవ సంఘ నాయకులు తెలుగుదేశం వైసిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు మృతుడికి భార్య ఎదురు పిల్లలు ఉన్నారు.

## ప్రగాఢ సానుభూతి తెలిపారు మృతుడికి
# భార్య ఎదురు పిల్లలు ఉన్నారు

## ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో పలాస నియోజకవర్గ తొలి శాసన సభ్యురాలు గౌతు శిరీష సుడిగాలి పర్యటన చేస్తూ ప్రజానీకానికి ఉన్న సమస్యలు అడిగి తెలుసుకుని సంబంధిత శాఖ అధికారులకి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేస్తున్నారు 2019లో పలాస నియోజకవర్గం అవినీతికి ముందడుగు భూకబ్జాకి చిరునామా గా నాయకులు నాయకుడు చలామణి అయ్యారని కానీ ఈ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ప్రజా సంక్షేమ కోరి ప్రభుత్వమని అభివృద్ధికి చిరునామా సంక్షేమ పథకాలలో ముందు అడుగులో అని ప్రతి రైతు కి సాగునీరు అందించే ఘనత ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు తెలుగుదేశం పార్టీకి సాధ్యం పడుతుందని అన్నారు మహిళలకి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం సౌకర్యం కలిగించింది తెలుగుదేశం ప్రభుత్వం అని త్వరలో అన్నా క్యాంటీన్ ప్రారంభం అవుతుందని తెలియజేశారు 2019 లో మంత్రి అయినా నాయకులకి అభివృద్ధి అంటే తెలియదు కానీ భూకబ్జాలు అవినీతికి పాల్పడడం నేర్చుకున్నరరు పలాస నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు.

# ఘనంగా మరిడిమాంబ పండగ



**యలమంచిలి ప్రతినిధి, ఆగస్టు 1, మేజరన్యూస్:** రాంబిల్లి మండలం వై.లోవ గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పుట్టీపై శారద నదిని దాటారు. శారద నది ఆవల అమ్మవారు కొలువైనారు. దీంతో భక్తులు పుట్టీపై శారద నదిని దాటుతూ తరలివెళ్లారు. అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనలు, కోలాటాలు, నేలవేషాలుతో పాటు పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

# హైకోర్టు పీపీగా శ్రీకాకుళం జిల్లా న్యాయవాది



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చిన్నతుంగం పంచాయతీ పరిధిలోని కృష్ణచంద్రాపురం బీసీ సామాజికవర్గానికి చెందిన న్యాయవాది రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా నియమితులయ్యారు. న్యాయవాది మెండ లక్ష్మీనారాయణను పీపీగా నియమిస్తూ న్యాయశాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి సునీత ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర చరిత్రలో మొదటి సారి రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో ప్రాసిక్యూషన్లు, క్రిమినల్ కేసుల అప్పీళ్ల విచారణ, తదితర కేసుల్లో పీపీ హోదాలో లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి చూసినా బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఈ పదవిలో నియమించడం ఇదే తొలిసారి. గతంలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అత్యున్నతస్థాయి పోస్టుల భర్తీలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన తెదేపా ప్రభుత్వం.. ఈసారీ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. పోలినాటి వెలమ(బీసీ) సామాజికవర్గానికి చెందిన లక్ష్మీనారాయణను కీలకమైన పోస్టులో నియమించడమే అందుకు నిదర్శనం. వ్యవసాయం కుటుంబం నుంచి లక్ష్మీనారాయణది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చిన్నతుంగం పంచాయతీ పరిధిలోని కృష్ణచంద్రాపురం. తల్లిదండ్రులు తవిటమ్మ, కృష్ణమ్మ. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన లక్ష్మీనారాయణ టెక్కలిలో డిగ్రీ, విజయనగరం లో బీఈడీ, ఆంధ్ర వర్సిటీలో ఎల్ఎల్‌బీ, నాగార్జున వర్సిటీలో ఎమ్మెస్సీ, ఉస్మానియాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2009లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 2014-19 మధ్య ప్రత్యేక సహాయ పీపీగా పనిచేశారు. మరో 14 మంది ఏజీపీల నియామకం హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు తాజాగా మరో 14 మంది న్యాయవాదులను సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీ)గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జులై 3న 14 మందిని నియమించిన విషయం తెలిసిందే. మొత్తం 28 ఏజీపీలలో 17 (61%)మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు కావడం విశేషం. ఏజీపీలుగా తాజాగా నియమితులైన వారిలో మొర్తా శ్రీనుబాబు, సీహెచ్.శాంసన్, సంధ్యదీప్తి, మేకల అనూష, షహీన ఖాతూన్, ఆర్.సూర్యనారాయణ, కొరిబిల్లి సందీప్, తుంగల రఘుప్రసాద్, ఆర్ఎస్ మణిధర్ పింగళి, జె.కృష్ణ ప్రణీత్, అరువ రఘురాం, శ్రీనివాస్ పాతూరి, అప్పసాని వినీత్, కాటా సాంబశివరావు ఉన్నారు. ఏజీపీలకు నెలకు రూ.44 వేల గౌరవ వేతనం చెల్లిస్తారు. వీరు ఏజీ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. బాధ్యతలు చేపట్టిన దగ్గరి నుంచి మూడేళ్ల పోస్టులో కొనసాగుతారు.

# గోవిందపురంలో గల వర్తక సంఘాలు ఎమ్మెల్యే శిరీషతో ఆత్మీయ కలయిక



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలంలో వాణిజ్య కేంద్రంగా ఉన్న పూండిలో వర్తక సంఘ సభ్యులు గోవిందపురం మాజీ పి.హెచ్.సి మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు లి మరియు మండల ప్రధాన కార్యదర్శి లికర్ని రమణ ఆధ్వర్యంలో వర్తక సంఘాల సభ్యులు అందరూ కలిసి ఎమ్మెల్యే పలాస నియోజకవర్గ తొలి శాసన సభ్యురాలు గౌతు శిరీష ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్తక- వాణిజ్య వ్యాపారస్తులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని, ఏనాడు కూడా వారికి ఇబ్బంది కలిగించే ఏ చిన్న పొరపాటు కూడా జరగకుండా చూస్తానని, అలాగే పూండి వాణిజ్య కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మీ మనసుల్లో మంచి స్థానం సంపాదించుకుంటానని, అదే విధంగా మాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న పూండి వ్యాపారస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కలిసిన వారిలో సీపాన గోపి, శనాపతి మురళీ, కొంచాడ నూకరాజు, దున్న రమేష్, కెంగువ రాంబాబు, గొర్లె గణేష్, కొంచాడ ధర్మారావు, శనాపతి రమణ, కొంచాడ వెంకటరావు, కొంచాడ గోవింద, కొంచాడ శేఖర్, శనాపతి సతీష్, మాడుగుల లక్ష్మణ, ఉత్తరాల బాలరాజు, గజరాజు జగది, సైని బాలాజీ, రెయ్యి అప్పారావు, తంగుడు రాజు, రాము, వెంకట్రావు మాస్టారు, బృందా తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# అమ్మపాలు అమృతం

## -అంగన్వాడీ వర్కర్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం
## -పెదగుడబ గ్రామంలో ర్యాలీ



**గరుగుబిల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** అమ్మపాలు అమృతం అని పెదగుడబ అంగన్వాడి కేంద్రం వర్కర్ చింతాడ గౌరమ్మ అన్నారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండల పరిధిలోని పెదగుడబ, గరుగుబిల్లి, తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాలు వారోత్స వాలు సందర్భ ముగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాలు వారోత్సవాలు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ నినా దాలు చేశారు. అనంతరం జరిగిన స మావేశంలో అంగన్వాడి వర్కర్ మాట్లాడుతూ తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని, బిడ్డను ఆనారోగ్యాలు నుండి దూరం చేస్తుందన్నారు. పెద గుడబ గ్రామపం చాయతీ కార్యదర్శి అల్లు రమేష్ మాట్లాడుతూ తల్లి పాలుతో శిశు మరణాలు తగ్గించ వచ్చని సర్వేలు వెల్లడిస్తున్నాయని అన్నారు. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో తల్లిపాలు పాత్ర కీలకమని చెప్పారు. గరుగుబిల్లి, హిక్కింవలస, గ్రామాల్లోని అంగ న్వాడి కేంద్రాల వర్కర్లు పి కృష్ణవేణి, ఎం పద్మ, ఎం స్వాతిలు, మాట్లా డుతూ ముర్రపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యం అన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడంవలన తల్లి బిడ్డలకు ప్రయోజన కరమన్నారు. ఈకార్య క్రమంలో పలువురు పాల్గొన్నారు.

## 95 శాతం ఎన్టీఆర్ భరోసా పంపిణీ



**దుంబ్రిగుడ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండలంలో 95 శాతం ఎన్టీఆర్ భరోసా పించన్ లను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ జయఉమ తెలిపారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు. సచివాలయ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల ఉద్యోగ సిబ్బందితో పింఛన్లను ఇంటింటికెళ్లి పంపిణీ చేశామని మిగిలిన పింఛనను శుక్రవారం పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# పలాస తహశీల్దార్‌గా సత్యం



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జల్లా, పలాస మండల తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్. నాయుడు స్థానంలో సత్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జలుమూరు మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహించేవారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్.ఎస్.వి.ఎస్ నాయుడు ఎన్నికల విధుల్లో చోటుచేసుకున్న బదిలీల్లో భాగంగా పలాస వచ్చి, తిరిగి తన పూర్వస్థానం నర్సీపట్నం వెళ్లిపోయారు. అయితే ప్రస్తుతం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా పలాస లో కలుసుకున్నారు శుభాకాంక్షలు తెలుపుకున్నారు

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

## -ఏ ఈ బొంతాడ శంకరరావు వెల్లడి
## -ఉదయం 8నుండి మధ్యాహ్నం 3గంటలు వరకు సరఫరా నిలుపుదల



**గరుగుబిల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్ ఆదేశాలు మేరకు గరుగుబిల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ షన్ నిర్వహణ పనులు కారణంగా శు క్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యా హ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయ నున్నారు. ఈమేరకు విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్వహణ పనులతో పాటు ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్న విద్యుత్తు లైన్ లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మల ను తొలగించడం జరుగుతుం దన్నారు. గరుగుబిల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. నిర్వహణ పనులు కారణంగా విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్న నేపథ్యంలో విని యోగదారులు ఈవిషయంను గమనించాలని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బొంతాడ శంకరరావు తెలిపారు.

# శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

## -ఘనంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమంలు
## -భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం -పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**గరుగుబిల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమంలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, తదితర పూజా కార్యక్ర మాలు జరిగాయి. అదేవిధంగా శ్రీషిరిడి సాయిబాబాకు విశేష అర్చనలు అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ ప్రాంగ ణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త, అసంఖ్యా క దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారాలతో శ్రీఅనగా దేవి సహిత జైగురు దత్త హెూమంలను నిర్వహించారు. అదే విధంగా హెూమంలు చేయించు కోవడంవల్ల ఈతి బాధలు తొలగడంతో పాటు మనసులో కోరిన కోర్కెలు నెరవేరు తాయని తెలిపారు. ఆలయ అర్చ కులు నల్లకాంతం శ్రీనువాసరావు శ్రీఅనగాదేవి సహిత జైగురు దత్త హెూమంలను నిర్వహించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. హెూమంలు కార్యక్రమం లో పాల్గొన్న దంపతులకు దీక్ష వస్త్రములను కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే దాతలచే అన్నదానం కార్యక్రమంను నిర్వ హించడం జరిగిందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాలకొండ, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదంలను అందజేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సెస్సు బకాయిలు చెల్లించేంలా చర్యలు చేపట్టాలి

## -ఈవోపిఆర్‌డికి తెలియ జేసిన గ్రంథాల నిర్వాహకులు మధుసూదనరావు -సెస్సు బకాయిలు గ్రంథాలయ సంస్థకు జమ చేయాలి

**గరుగుబిల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని మండల ఈ ఓ పి ఆర్ డి ఎల్ గోపాలరావుకు స్థానిక శాఖ గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూద నరావు తెలియజేశారు. ఈమేరకు గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు రావలసిన సెస్సు బకాయి లను గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెల్లించేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామ పంచాయతీ ల నుంచి గ్రంథాలయ సంస్థకు 8 శాతం బకాయిలను జిల్లా గ్రంధా ల యసంస్థకు జమ చేయాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా ఈ వో పీ ఆర్ డి గోపాలరావు మాట్లాడుతూ గ్రామ పంచాయ తీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్సు బకా యిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు చేపట్టనున్నా మని పేర్కొ న్నారు.



## విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో
## ఘనంగా ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం



**మద్రిపాలెం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమంను కళాశాల ఐ.క్యు.ఏ.సి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇందిరాగాంధీ ఢిల్లీ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ప్రో,, డాక్టర్ ఎస్. రామనారాయణ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు విద్యను ఏ విధంగా బోధించాలో మెలకువలను క్షుణ్ణంగా వివరించారు. అదేవిధంగా చదువుతోపాటు పారిశ్రామిక నైపుణ్య అభివృద్ధిని ఏ విధంగా పెంపొందించుకోవాలో సూచించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, పైథాన్ కోర్సుల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్ వర్మ, డీన్ మరియు అకాడమిక్స్ డాక్టర్ శాంతారావు ఐ.క్యూ.ఏ.సీ కో ఆర్డినేటర్ సి.హెచ్.బి.ఆర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మందస కళాశాలలో
## ఉచిత పుస్తకాలు పంపిణీ కార్యక్రమం
### పలాస శాసనసభ్యులు గౌతు శిరీష



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం మందస గవర్నమెంట్ జూనియర్ కళాశాల లో ఉచిత పుస్తకాలు పంపిణీ కార్యక్రమం లో మాట్లాడుతూ విద్యాభివృద్ధి అంటే.. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచి, సృజనాత్మకత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. విద్యార్థుల సామర్థ్యం పెంచి మంచి ఫలితాలకు కృషి చేయాలి అని,విద్యార్థుల సమగ్ర అభివృద్ధే మా లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ సి సి స్టూడెంట్స్ ఆధ్వర్యంలో మొక్కల ను నాటారు. ఈ కార్యక్రమంలో మందస జూనియర్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు మరియు మందస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కదలలేని వృద్ధురాలకు పింఛను
## అందిస్తున్న ఈ.ఓ.పి.ఆర్.డి చంద్రశేఖర్



**పాయకరావుపేట, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం గ్రామానికి చెందిన కాకడ మార్తమ్మ మంచంలో కదలలేని పరిస్థితిలో ఉండడంతో పాయకరావుపేట ఈఓపిఆర్డి సిహెచ్.చంద్రశేఖర్ నేరుగా వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. అలాగే పాయకరావుపేటలో జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు 100 శాతం ఇవాళే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉదయం 6 గంటల నుంచే పింఛను పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ,వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం పరిధిలో వున్న షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు వైభవంగా జరుగనున్నాయి. ఈ మేరకు ధ్యాన మందిరాన్ని అన్ని ఏర్పాట్లతో విద్యుత్ దీపాలతో తీర్చి దిద్దారు ప్రతి గురువారం భక్తులు .ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



**పలాస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, పలాస ఎమ్మెల్యే శిరీష అన్నారు. మందస మండలం హరిపురం గ్రామంలో గురువారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పంపిణీ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు లబ్దిదారుల వద్దకు వెళ్లి పింఛన్లను అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెం పుదల చేసినట్టు చెప్పారు. అలాగే పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తు న్నట్టు చెప్పారు. కార్యక్రమంలోటీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వయంభు విఘ్నేశ్వర ఆలయంలో
## 5 నుండి గణేష్ మండల దీక్ష ప్రారంభం



**చోడవరం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్** చోడవరం పట్టణంలో మరో కాణిపాకం గా విరాజిల్లుతున్న స్వయంభు విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5 శుద్ధ పాడ్యమి సోమవారం నుండి మండల దీక్ష ప్రారంభిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహ ణాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 41 రోజుల మండల దీక్ష అనంతరం సెప్టెంబర్ 16వ తేదీ సోమవా రం దీక్షా విరమణ ఉంటుందన్నారు. 26 శ్రావణ మాసం బహుళ సప్తమి సోమవా రం నుండి అర్ధ మండల దీక్ష, సెప్టెంబర్ 7వ తేదీ భాద్రపద శుద్ధ చవితి శనివా రం నుండి నవరాత్రి తొమ్మిది రోజుల దీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆలయ అర్చకులు నెంబర్ 9985045010 సంప్రదించాలని కోరారు.

## కే కోటపాడులో తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ



**కే కోటపాడు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** తల్లిపాల విశిష్టతపై పలువురు గర్భిణీలకు, బాలింతలకు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్వాడి అధికారులు అవగాహన కల్పించారు. గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడి సిబ్బంది మహిళా పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందిం చాలని తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం కే.కోట పాడు లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎల్.బి సుశీల, మహిళా పోలీస్, అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు,తదితరులు పాల్గొన్నారు.

## చదువు జీవితానికి వెలుగునిస్తుంది : ఎమ్మెల్యే



**పార్వతీపురం రూరల్, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ప్రతి విద్యార్థి వారి యొక్క విద్యార్థి దశను సద్వినియోగం చేసుకోవాలని ,విద్య కేవలం సమాజంలో గౌరవం పెంచడమే కాకుండా ఎంతో విలువని తెచ్చిపెడుతుందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు.ప్రతి ఒక్కరూ బాగా చదువుకుంటే వారి జీవితం ఉన్నతంగా మలుపు తిరిగేందుకు అవకాశం ఉందని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన నోట్ పుస్తకాలు బ్యాగులను ఎమ్మెల్యే విజయ్ చంద్ర గురువారం పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉద్యోగం సంపాదించి వారి కుటుంబం మొత్తం ఆర్థికంగా నిలదుక్కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని , గత వైకాపాలనలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందించలేని పరిస్థితి ఏర్పడి, అనేకమంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు మధ్యలో చదువులకు దూరమైన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. వాటిని గుర్తించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు బ్యాగులు అందించేందుకు చర్యలు చేపట్టారని ఈరోజు వాటిని అందించడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామారావు అధ్యాపకులు మరియు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంపిణీ సక్రమంగా జరగాలి

### : ఆర్డీవో హేమలత



**పార్వతీపురం రూరల్, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ప్రతి కార్డుదారులకు సక్రమంగా సమయానికి ప్రభుత్వం అందజేస్తున్న నిత్యవసర సరుకులు అందేలా చూడాలని ఆర్డిఓ హేమలత అన్నారు. మండలంలోని సరఫరా అవుతున్న బియ్యం పంపిణీను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్న బండపల్లి గ్రామంలో ఎం డి యు పరిశీలించి అందుకు సంబంధించి పత్రాలను తనిఖీ చేశారు. పంపిణీలో అవకతవకలు జరగకూడదని, సక్రమంగా తూకం వేసి బియ్యాన్ని కార్డుదారులకు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్డుదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని బహిరంగ మార్కెట్లో విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

## డిప్యూటీ డిఎంహెచ్ఓగా జగన్మోహన్ రావు



**పార్వతీపురం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** డిప్యూటీ డిఎంహెచ్ఓగా డా. టి. జగన్మోహన్ రావు గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇంత వరకు ఆయన మన్యం జిల్లాలో వైద్య విభాగంలో వివిధ హెూదాల్లో విధులు నిర్వహించారు.జిల్లా మలేరియా అధికారులతో పాటు ప్రోగ్రాం ఆఫీసర్గా విశేష సేవలు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. విజయ పార్వతి ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డా. జగన్మోహన్ మాట్లా డుతూ గిరిజనులకు ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా మరియు సాధించవలసిన లక్ష్యాలను ముందంజలో తీసుకు పోవడానికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లా ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షులు డా.పిఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## వృద్ధ మహిళలకు బాబా ఆలయ కమిటీ చీరలు పంపిణీ



**కే కోటపాడు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండల కేంద్రం కే కోటపాడు లో శిరిడి సాయిబాబా ఆలయ మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన చీరలను నిరుపేద వృద్ధ మహిళలకు ఆలయ కమిటీ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, నిరుపేదలను ఆదుకోవడానికి ఎవరు వస్త్రధానాలు చేసిన పేదవారికి అందిస్తామని చెప్పారు.అనంతరం ప్రతి గురువారం జరిగే అన్న ప్రసాదాలను స్వీకరించి బాబా దైవ కృపను పొందారు. ఈ కార్యక్రమంలోకమిటీ సభ్యులు వేగి రామారావు, యల్లా సాయి, పాపారావు, ఆర్ పి నాయుడు, గంగు నాయుడు, భక్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రేమ స్వరూపి మినిస్ట్రీస్ 9వ వార్షికోత్సవ వేడుకలు

**పాయకరావుపేట, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండలంలోని శ్రీ రాంపురం గ్రామంలో ఉన్న ప్రేమ స్వరూపి మినిస్ట్రీస్ 9వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మరియు చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఇంచార్జ్ జగతా శ్రీనివాస్,సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్ రావు,మండల విద్యాశాఖ అధికారులు కే.ఎన్ గాంధీ,జి.రమేష్,శ్రీ రాంపురం పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కావ్య,డాక్టర్ తులసి నవీన హాజరయ్యారు.ఈ సందర్భంగా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గౌరవ అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి మోమెంటోలు అందజేశారు.అనంతరం మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అతిథులు చేతుల మీదుగా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.అలాగే నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేమ స్వరూపి మినిస్ట్రీస్ కు ప్రేమను పంచటం మాత్రమే తెలుసునని అందుకు నిదర్శనం



పేదలకు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలేనని కొనియాడారు.ఈ మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మినిస్ట్రీస్ నాయకురాలు లిల్లీ,పాస్టర్లు ప్రేమదాస్,ప్రేమ్ కుమార్,ప్రశాంత్ తదితరులను ప్రత్యేకంగా అభినందించారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**చోడవరం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండలంలో 61ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఎంఈఓ కే సింహాచలం గురువారం విడుదల చేశారు. 42 ప్రాథమిక,5 ప్రాథమికోన్నత,14 ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆగస్టు 1 ఎన్నికల జాబితా, 5 న అభ్యంతరము స్వీకరణ, తుది జాబితా ప్రదర్శన, 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. 50 శాతం ఓటర్లు హాజరు రిజిస్టర్ లో చూపిన తర్వాత ఎన్నికలు జరుగుతాయని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా, తహసిల్దారు, ఎంపీడీవో, వీఆర్వో, వీఆర్ఏ ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు అన్నారు. 8 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు తరగతుల వారి సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం మూడు గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, రిజిస్టర్ లో సంతకాలు అనంతరం, ప్రతిజ్ఞ చేయించి ప్రథమ సమావేశం నిర్వహించాలన్నా రు. తల్లి, తండ్రి, సంరక్షకుడు ఒక్కరికే ఓటు ఉంటుందన్నారు. విద్యార్థి పాఠశాల వదిలిన రోజే ఎస్ఎంసి సభ్యత్వం రద్దవుతుందని నోటిఫికేషన్ లో తెలిపారు.

## విద్యుత్ సెక్షన్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్‌గా ముత్యాల నాయుడు

**దేవరాపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** దేవరాపల్లి విద్యుత్ సెక్షన్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ గా జూరెడ్డి ముత్యాల నాయుడు ను నియమించారు. దేవరాపల్లి సెక్షన్ ఆఫీసులో ఏఈ కె. శంకర్రావు ఆధ్వర్యంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ 2003 లో దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అప్పటినుంచి ఈ పోస్టు లేకపోవడం వల్ల వినియోగదారులు చాలా ఇబ్బంది పడేవారు. వినియోగదారుల బిల్లు అవకతవకలు సరి చేయడానికి చాలా ఇబ్బంది పడేవారు . ఈ బిల్లులు సరి చేయడానికి గతంలో అనకాపల్లి ఆఫీస్ కు పంపించవలసి వచ్చేది. మొట్టమొదటిగా దేవరపల్లి సీనియర్ అసిస్టెంట్ గా ముత్యాల నాయుడు ను నియమించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వినియోగదారు బిల్లుల సరి చేయడంతో పాటు దేవరాపల్లి మండలంలో ఉన్న బిల్లు కలెక్షన్ చూడటం జరుగుతుందన్నారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు చేపట్టిన ముత్యాల నాయుడు ను



జేఈ ఆర్ సన్యాసినాయుడు, లైన్ మాన్ బొడ్డు రాము, కంప్యూటర్ ఆపరేటర్ పాసల వెంకట గణేష్, సిబ్బంది అప్పలరాజు, జాగరపు సతీష్ అభినందించారు.

## రైతు ఉద్యమ నేత కామ్రేడ్ మాకిరెడ్డి దేముడుకు ఘన నివాళులు



**నర్సీపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఉమ్మడి విశాఖ జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సీనియర్ నాయకులు రైతు ఉద్యమ నేత కామ్రేడ్ మాకిరెడ్డి దేముడు స్థూపం వద్ద ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.వి.సత్యనారాయణమూర్తి, సిపిఐ ప్రజాసంఘాలు నాయకులు, బంధుమిత్రులు నివాళులర్పించారు స్థూపం నుండి స్వగృహం దగ్గరకి ర్యాలీగా వెళ్లి సభ ప్రాంగణం వద్ద మాకిరెడ్డి దేముడు ఫొటోకు పూలమాలతో జోహర్లు అర్పించి వర్ధంతి సభకు రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు కామ్రేడ్ రావు జగ్గారావు అధ్యక్షతన జరిగింది సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి. జె.వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గబ్బాడ గ్రామంలో కామ్రేడ్ దేముడు పుట్టి మరణించినాటికి 98 సంవత్సరాలు వయసుతో సంబంధం లేకుండా చివరి క్షణం వరకు ఎర్రజెండా పక్షాన నిలబడి పంచాయతీ స్థాయి నుండి జిల్లా రైతు ఉద్యమాల వరకు ప్రజా పరిపాలనతో అనేక భూ పోరాటాలు నిర్వహించి చివరి వరకు సిపిఐ పార్టీ త్యాగస్ఫూర్తి అని మనమంతా భావించాలి దేముడు ఆశయాలు సాధించడం అంటే నేటి కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉండి ధన రాజకీయ పార్టీల వైపు వెళ్లేవారికి కామ్రేడ్ దేముడు స్ఫూర్తి ఉండాలి నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ చివరి క్షణం వరకు ఎర్ర జెండా ఉద్యమ బాటలో ఉన్నారు నిజమైన స్ఫూర్తి ఆయన్ని గుర్తు చేసుకుంటూ మనమంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో విద్య, వైద్యం ప్రభుత్వ రంగ సంస్థలుగా ఉన్నప్పుడే ప్రజా ఆరోగ్యం, యువతకి సంపూర్ణమైన విద్య అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కొయ్యూరు మండల జడ్పిటిసి వారా నూకరాజు,రాష్ట్ర సమితి నాయకులు అచ్చుత్, జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుబ్బలక్ష్మి,జిల్లా సహాయ కార్యదర్శిలు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, సిపిఐ ప్రజా సంఘ జిల్లా నాయకులు గంగాభవాని, గోల్కొండ నూకినాయుడు, జి.గురుబాబు, ఎల్.వి. రమణ, మేకా సత్యనారాయణ, పార్టీ జిల్లా,మండల సభ్యులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సీయోను ప్రార్థన మందిరం వార్షికోత్సవం

**దేవరాపల్లి, ఆగస్ట్ 1, మేజర్‌న్యూస్:** నిస్సి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కాశీపురం సీయోను ప్రార్థన మందిరం 46వ వార్షికోత్సవం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. 1979లో తూర్పుగోదావరి జిల్లా నుంచి యేసుప్రభు పరిచర్య చేయడానికి రెవ. ఫిలోమోన్ పద్మ జాయ్ దంపతులు ఈ ప్రాంతానికి రావడం జరిగింది. అప్పుడు స్థాపించిన ఈ ప్రార్థన మందిరం అంచెలంచెలుగా ఎదగడం ప్రారంభించింది. మందిరం ద్వారా అనేకమైన కుటుంబాలు, గ్రామాలు, ప్రాంతాలు దీవించబడ్డాయి . వీరి కుమారుడు రెవ.బిషప్ టైటస్ గొర్లె గత 15 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో దైవ సేవకురాలు గ్రేస్ టైటస్ సంఘ బిడ్డలు ప్రత్యేకమైన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కొంతమందికి బహుమతులు ఇవ్వడం జరిగింది. డా " టైటస్ గొర్లె ప్రత్యేకమైన వాక్య సందేశాన్ని అందించారు. వార్షికోత్సవ శుభాకాంక్షలు



పాస్టర్ జయరాజు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దైవజనులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ఎల్లేటి



**నక్కపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** వైస్సార్ సీపీ సీనియర్ జిల్లా బీసీ నాయకులు ఎల్లేటి సత్యనారాయణ తాడేపల్లి లోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండలానికి సంబంధించిన పలు విషయాలు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయనకు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేయమని సత్యనారాయణను జగన్మోహన్ రెడ్డి సూచించారు.

## తల్లిపాలను మించిన ఔషధం మరొకటి లేదు

### కొయ్యూరు సిడిపిఓ విజయ కుమారి



**కొయ్యూరు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగిందని కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా రామాపురం కేంద్ర పరిధిలో ఉండే బాలింత గృహ దర్శనం చేస్తూ వారికి తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతిరోజు తీసుకోవలసిన ఆహారం, ఆరోగ్య సూత్రాలు వివరించడం జరిగింది. అనంతరం మర్రిపాలెం కేంద్రంలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమం నిర్వహించామని ఐసిడిఎస్ పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ తో పాటు మెడికల్ ఆఫీసర్, స్కూల్ టీచర్, సూపర్వైజర్ సునీత, కొండమ్మ, మహాలక్ష్మి, బాలమణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యారంగ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

### యూటి ఎఫ్ నాయకులు



**వంగర, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వంగర మండల యూటీ ఎఫ్ అధ్యక్షులు ఎం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్ మండల విద్యాశాఖాధికారి వై.దుర్గారావు కు వినతి పత్రం అందచేశారు.గురువారం నాడు ఈ సందర్భంగా వారు117 జీ ఓ నురద్దుచేయాలని, ప్రీ ప్రైమరీ తో పాటు ఒకటి నుండి ఐదు తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.అనంతరం వారు లతోప్రతి తరగతికి ఒకఉపాధ్యాయుడు ఉండేలాచర్యలు తీసుకోవాలనే మొదలగు డిమాండ్లతో వారు మండల విద్యాశాఖ అధికారి వై. దుర్గారావు కు వంగర ఎం ఈ ఓ కార్యాలయంలోకలసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వంగర మండల యూ టీ ఎఫ్ అధ్యక్షులు ఎం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, ఎస్ అప్పలనాయుడు, ఓవి భాస్కరరావు, బి అప్పారావు, పి చంద్రమౌళి, బి చంద్రమౌళి, బి రమేష్, పి శ్రీరామ్ మూర్తి, పి మురళి, కె.సత్యం నాయుడు,బి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సూచినల మేరకు ఎటువంటి మతపరమైన భోదనలు చేయబోము

### స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల యాజమాన్య హామీ



**పద్మనాభం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పద్మనాభం జంక్షను సమీపంలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డు పాఠశాలలో ఇకపై తల్లిదండ్రులు,ప్రభుత్వ అధికారులు సూచినల మేరకు మతపరమైన భోదనలు ఉండవని పాఠశాల కరస్పాండెంటు అలీవరరాయి అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చేస్తున్న ఏసుక్రీస్తు భోదనలపై ఇటీవల పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు అభ్యంతరం తెలిపారని, అలాగే దీనిపై జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు పరిశీలన చేసారని ఆయన అన్నారు. అయితే అధికారులు సూచినలను నియమ నిబంధనలను పాఠశాలలో తప్పకుండా పాటిస్తారని ఆయన అన్నారు. అలాగే తల్లిదండ్రులు మనోబావాలను గౌరవిస్తూ ఎప్పటివలె పిల్లలను ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దితారని ఆయన అన్నారు.అలాగే తమ దిద్దుబాటు చర్యలను గమనించడానికి, ఎటువంటి అపోహాలు,అనుమానాలు, సందేహాలు ఇవ్వడానికి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల మూడవ తేదీన పాఠశాలకు రావాలని ఆయన కోరారు.

## తల్లిపాలు వారోత్సవాలుపై అవగాహన ర్యాలీ



**గొలుగొండ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** పిల్ల లు జన్మించినప్పటి నుండే తల్లిపాలు పట్టడం ఎంతో శ్రేయస్కరమని కృష్ణ దేవి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు హరి ప్రవీణ్, గాయత్రిలు తెలిపారు గురువారం తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యతపై ర్యాలీలు ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని వారు అన్నారు దీనిలోభాగంగా ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ గర్భిణీలకు బాలింతలకు ప్రజలకు అవగాహన కల్పిస్తారని ఈ సందర్భంగా డాక్టర్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గొలుగొండ మండలంలో పెన్షన్లు పంపిణీ చేసిన ఎంపీడీవో రత్నకుమారి



**గొలుగొండ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** గొలుగొండ మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి డిఎన్ రత్నకుమారి పంచాయతీ సెక్రెటరీ ఆర్ వి సత్యనారాయణ అండ్ రఘురాం గొలుగొండ మండలంలో 27 పంచాయతీల్లో 8.648 పింఛన్దారులకు మూడు కోట్ల 55 లక్షల 31,000 రూపాయలు పంచాయితీ సెక్రటరీలు సచివాలయ సిబ్బంది కలసి ఒకటో తారీఖున ఉదయం 11 గంటలకు పెన్షన్ దారులకు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

## స్పీకర్ సతీమణికి వినతిపత్రం అందజేసిన భవన కార్మికులు



**గొలుగొండ, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** చింతకాయల పద్మావతి దృష్టి కి గొలుగొండ మండలం భవన నిర్మాణ కార్మికులు సమస్యలు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గెద్దం నానాజీ పాల్గొన్నారు.

## వాహన తనిఖీలలో పట్టుబడ్డ 60 కేజీల గంజాయి



**కొయ్యూరు, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** కొయ్యూరు మండలం భీమవరం బుధవారం కొయ్యూరు ఎస్సై రామకృష్ణ కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు వాహన తనిఖీలు చేస్తుండగా రంపుల ఘాటి నుండి కేడీపేట వైపు వెళుతున్న ఆటోలో రెండు గోనె సంచులతో 60 కేజీల గంజాయి తరలిస్తుండగా ఎస్సై మరియు సిబ్బంది కలిసి ఇద్దరు వ్యక్తులు లను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు. అరెస్టు కాబడ్డ వ్యక్తులు ఒకరు కోరుకొండ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా మరొకరు చింతపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గా గుర్తించారు వీరు వద్ద నుండి 60 కేజీల గంజాయి సెల్ ఫోన్ స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

## హెూం మంత్రి అనితకు సమస్యలపై పలు వినతుల వెల్లువ



**నక్కపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** హెూం మంత్రి వంగలపూడి అనితకు ప్రజలు, కూటమి నాయ కులు వివిధ సమస్యలపై వినతులు అందించారు. సారిపల్లి పాలెంలోని ఆమె నివాసం వద్దకు గురువారం ప్రజలు అధిక సంఖ్యలో చేరుకుని ఆమెకు పలు సమస్యలు విన్నవించారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలే కాకుండా వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## నూతన ధారావాహిక ప్రారంభం

**శ్రీకాకుళం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** నమ్మకద్రోహానికి బలైన ఇద్దరు వ్యక్తుల జీవితమే ఇతివృత్తంగా తెరకెక్కుతున్న కలవారి కోడలు కనకమహాలక్ష్మి'. సీరియల్ ఆకట్టుకునే కుటుంబ కథగా ప్రేక్షకుల ముందుకు జీ తెలుగులో రాబోతోందని తండ్రీకూతుళ్ల బంధం, భార్యాభర్తల అనుబంధం మధ్య ఉద్వేగభరితంగా సాగే ఈ సరికొత్త సీరియల్ ఆగస్టు 5న ప్రారంభమవుతుందని , సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, జీ తెలుగులో ప్రసారం కానున్నదని మీడియా ప్రతినిధి తెలిపారు. కూతురు భవిష్యత్తు కోసం ఆరాటపడే తండ్రి, ఆయన సంతోషం కోసం పాటుపడే కూతురు, తండ్రి కోరికను గౌరవించడం తప్ప మరో కల లేని కనకమహాలక్ష్మి కథే ఈ సీరియల్ అని, ప్రేమ, పెళ్లి, విధి నడుమ సాగే కథ ఉత్కంఠరేపే మలుపులతో ఆకట్టుకుంటుందన్నారు.

## నర్సీపట్నంలో 96.79 శాతం

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### రేపటికి అందరికీ అందిస్తాం కమీ షనర్ పూడి రవిబాబు



**నర్సీపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం మున్సిపాలిటీలో గురువారం నాడే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 96.79 శాతం పూర్తి చేశామని నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. ఉదయం 5 గంటల నుండి పింఛన్ల పంపిణీ ప్రారంభించామని, మున్సిపాలిటీలో 7,175 మంది పింఛనుదారులుండగా, 6,945 మందికి పింఛన్లు అందజేశామన్నారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. కాగా నియోజకవర్గంలోని గొలుగొండ మండలంలో 96.43 శాతం, మాకవరపాలెం మండలంలో 95.92 శాతం, నర్సీపట్నం మండలంలో 96.84 శాతం, నాతవరం మండలంలో 96.82 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



**పాయకరావుపేట, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల పాయకరావుపేటలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు గంపల చినరాజు మాట్లాడుతూ సామాజిక న్యాయమైన ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ తీర్పు ఈ రోజు సుప్రీంకోర్టులో మాదిగలకు అనుకూలంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల మాదిగల చిరకాల స్వప్నమైన వర్గీకరణకు సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడంతో ఈ ఉద్యమానికి సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు, వివిధ రాజకీయ పార్టీలకు సామాజిక ఉద్యమ నమస్కారాలు తెలుపుతూ వెంటనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తుమ్మలపల్లి లక్ష్మణరావు, సలికే అచ్చయ్య, కుందూరు రానా, తుమ్మలపల్లి కుమార్ ,వేమగిరి లక్ష్మణరావు, తుమ్మలపల్లి సతీష్, బొడ్డపాటి సతీష్, గాలింక ఆనందరావు, తుమ్మలపల్లి మాయావతి రావు, ఆరుగుల రమేష్, మంజులూరి దుర్గాప్రసాద్, సలికే గోవిందు, తుమ్మలపల్లి సురేష్, ఇదుగుపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు,

# ఫించనులు పంపిణీ కార్యక్రమం



**భీమునిపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, జోన్-1, భీమిలి పరిధిలో గురువారం ఉ.గం. 5.00 ని. నుండి ఫించనులు పంపిణీ కార్యక్రమము జరిగింది. జోన్-1 భీమిలి పరిధిలో మొత్తం పెన్షన్లు 8675కు గాను గురువారం 8379 పెన్షన్స్ బట్వాడా చేయటం జరిగింది. ఈ పెన్షన్లు కార్యక్రమంలో కె. కనకమహాలక్ష్మి, జోనల్ కమీషనరు నిడిగట్టు, కృష్ణాకోలని, ఆదర్శనగర్-01 మరియు బాలాజీనగర్ సచివాలయాల పరిధిలో ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమములో జోనల్ కమీషనర కె కనకమహాలక్ష్మి, వై. సంతోష్ కుమార్, ఎ.పి.డి. మరియు ఇతర జోనల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు పరజాలు వితరణ



**నక్కపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** మండలంలోని రాజయ్య పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సరిపడ క్లాస్ రూం లేనందున కింద కూర్చొని పాటలు వింటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ ప్రెసిడెంట్ పిక్కి స్వామి విద్యార్థుల కి పరజాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆగస్ట్ 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించే విధంగా ఆటల్లో గెలుపొందిన ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జనసేన పార్టీ సెక్రటరీ పిక్కి తాతాజీ, యూత్ లీడర్ కుందేటి శీను, అలాగే కార్యవర్గ సభ్యులు విశ్వనాథ్, మహేష్, వంశీ, బలరాం తదితరులు పాల్గొన్నారు జరిగింది.

# పాఠశాలల విద్యాకమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



**నక్కపల్లి, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** స్థానిక మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ ఆదేశాల మేరకు పెదబోదుగల్లం హైస్కూలుతో పాటు అన్ని పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు సమక్షంలో మండలంలో ఉన్న 73 పాఠశాలలకు సంబంధించిన విద్యాకమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ తో కూడిన ఓటర్లజాబితాలను విడుదల చేశారు. ఈనెల 5 న విడుదల చేసిన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం .8 న ఎన్నికలను నిర్వహించి ఆరోజే విద్యాకమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు లను ఎన్నుకోనున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉంటుందని ఎంఈఓ. సత్యనారాయణ తెలిపారు. పాఠశాల అభివృద్ధి తోడ్పాటు నందించడం, నమోదును పెంపొందించడం, గుణాత్మక విద్య, పిల్లలు రోజువారీ హాజరును పెంపొందించడం, బాలికా విద్యను అభివృద్ధి పరచడం, డ్రాపౌట్స్ లేకుండా చూడడం, ప్రభుత్వం కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అమలుపరచడంలో విద్యాకమిటీ పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సత్యనారాయణ, వేమగిరి నూకరాజు ,ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేయాలి

### మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్



**వంగర, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేయాలని మాజీ మంత్రి, రాజాం శాసన సభ్యులు కోండ్రు మురళీమోహన్‌జి కోరారు. బుధవారం నాడు ఆయన వంగర మండలంలోని మద్దువలస జూనియర్ కాలేజీలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఐఎఎస్, ఐపీఎస్, ఐ ఆర్ ఎస్, ఐ ఎస్ ఎఫ్ త్రిబులైటీ తదితర వచ్చేటట్లు విద్యార్థులను తయారు చేయాలని ఆయన ప్రిన్స్ పాల్ నారాయణ రావు ను,లెక్చరర్స్ ను కోరారు. ఈ విద్యార్థుల్లో కనీసం10లేక 15 మందిని త్రిబులైటీ కి ఎంపికయ్యే టట్లు చూడాలని ఆయన జూనియర్ కాలేజీ సిబ్బందినికోరారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివేవారికి ఇంటర్మీడియట్ బుక్స్ బయట కొనుగోలు చేయాలంటే తీవ్ర ఆర్థిక భారం అవుతోందని. ఎన్నికల సమయంలో ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచితంగా బుక్స్ అందజేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారనీ ఈ హామీ మేరకు నేడు ఈ హామీని నెరవేర్చి మాట నిలబెట్టామన్నారు. ముందుగా మహిళా విద్యార్థులకు పలుప్రశ్నలు వేశారు. ఇంటర్ చదువుతున్న అంజిలీని, ,పల్లిదనలక్ష్మి, బూరాడ ప్రమీల విద్యార్థినులను మీరేం చదువుతారు, ఉన్నత చదువులు చదవాలని వారిని కోరారు. అనంతరం ఆయన్ని మద్దు వలస బీ అర్ అంబేద్కర్ మహిళా జూనియర్ కాలేజి కాంట్రాక్టుల ఉద్యోగులు కలిసి మమ్మలను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు కి వినతిపత్రం అందజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సిబ్బంది కాంట్రాక్టు పార్ట్ టైం సిబ్బంది మార్గమధ్యంలో ఆయన కోసం ఎదురు చూడగా, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ వారిని చూసి కాన్వాయ్ దిగి మీ సమస్య ఏమిటని మరి మరి అడిగి తెలుసుకున్నారు, కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నామని, ఇప్పటికి మాకు రెగ్యులర్ కాలేదని 2007 కు ముందు నుండిపనిచేస్తూవున్నా కాంటాక్ట్ సిబ్బందిని జీవో నెంబర్ 59 ద్వారా రెగ్యులర్ చేశారు అని మమ్మల్ని కూడా రెగ్యులర్ చేయాలనీ వారు కోరారు. అలానే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ గా పని చేస్తున్న సిబ్బంది, వారిని కాంట్రాక్టు నుండి రెగ్యుల ర్ చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు మురళి మోహన్ కు వినతి పత్రం ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ మీ సమస్యపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టిలో పెట్టి పరిష్కరించుటకు కృషి చేస్తానని వారికీ అయన హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యే కొండ్రు మురళి మోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ బొత్స వాసు దేవరా వు నాయుడు, మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, రాజాం నియోజ వర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, సీనియర్ నాయకుడు ఉదియాన మురళీకృష్ణ, పి. మోహన, అరసాడ పెట్రోల్ బంక్ ఓనర్, మాజీ సర్పంచ్ ధనలక్ష్మి భర్త లచ్చు భుక్త కృష్ణ మూర్తి, తదితర నాయ కులు జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ కొ రటాన నారాయణ రావు,లెక్చిరర్లు ఎం.గణపతి నాయుడు, ఎస్.శ్యామల దేవి, బలగ పోలి నాయుడు, టీ.ఈశ్వరరావు, జీ.సత్యన్నారాయణ, ఎల్.సురేష్ బాబు,బీ.కృష్ణారావు, కె.శ్రీనివా సరావు, ఎస్.సురేష్, వై.గీత, జీ.వెంక టేష్ బాబు, ఎస్. రాజాశేఖర్, వంగర ఎంపిడిఓ సాల్మాన్ రాజు, ఎస్. ఐ వీర జనార్ధన్,పోలీస్ సిబ్బంది,ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రొత్తరకం వేరియంట్ ఫ్లూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండండి

### ప్రముఖ చిన్న పిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ లక్ష్మీకాంత్



**నర్సీపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** "ఫ్లూ" వ్యాధి కొత్తరకం వేరియంట్ దేశవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తుందని, దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నర్సీపట్నంకు చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పూళ్ల లక్ష్మీకాంత్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతవారం రోజుల నుండి ఈ ఫ్లూ వ్యాధిలక్షణాలు నర్సీపట్నం పరిసర ప్రాంత వాసులకు తరచుగా రావటం గమనించామన్నారు. సుమారు 10 సంవత్సరాల క్రితం "స్వైన్ ఫ్లూ" వ్యాధితో చాలామంది ఇబ్బందులు పడ్డారని, అనేక మరణాలు సంభవించాయన్నారు. ఇప్పుడు వ్యాప్తి చెందుతున్న ఫ్లూ వైరస్ 1 నుండి5 సంవత్సరాల లోపు పిల్లలకు, 60 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి గాలిలో ఉండే ఉమ్మి, తుమ్ము రేణువుల ద్వారా ఒకరి నుండి ఇతరులకు త్వరగా వ్యాపించగలదన్నారు. 102, 103 డిగ్రీల జ్వరం రావడం, గొంతు నొప్పి, వాంతులు, విరోచనాలు, రొంప, తలనొప్పి, కడుపునొప్పి రావడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలన్నారు. కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలు ఇప్పుడు కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మాస్క్ వేసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చేతులు శుభ్రంగా కడుక్కోవటం భౌతిక దూరాన్ని పాటించడం వంటివి నివారణ మార్గాలన్నారు. లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, షుగర్, గుండె జబ్బు, ఆస్మా, పొగ త్రాగడం ద్వారా వచ్చే ఆయాసం, డయాలసిస్ ఉన్నవారికి ఈ వ్యాధి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. తగిన సమయంలో వైద్య సేవలు పొందడం ద్వారా వ్యాధి నివారణ చేయవచ్చన్నారు. ఒకవేళ వ్యాక్సిన్ వేయించుకుంటే ఆరు నెలల లోపు అదే వ్యాక్సిన్ రెండవడోసు వేయించుకోవాలని, జీవితాంతం ఏడాదికి ఒకడోసు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. స్కూలుకు వెళ్లే పిల్లలు తప్పకుండా మాస్కులు ధరించాలని, తల్లితండ్రులు ఈ వ్యాధి లక్షణాలు పిల్లలలో గమనిస్తే, ఒకవారం రోజులు స్కూలుకి పంపకుండా, వైద్య సేవలు అందించడం మంచిదని దీనిపై తగు జాగ్రత్తలు వహించాలని డాక్టర్ లక్ష్మీకాంత్ తెలిపారు.

# తల్లి పాలపై అవగాహన ర్యాలి

### డాక్టర్ సీతల్ వర్మ



**కొత్తవలస, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ సీతల్ వర్మ. సీతా మహాలక్ష్మి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని తల్లి పాలు వారోత్సవాలు ఆగస్టు 1 నుండి 7వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 13 వెల్నెస్ సెంటర్లో తల్లిపాలు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు తల్లిపాలు తోనే సంపూర్ణ ఆరోగ్య మని తల్లి పాలు అమృతం తో సమానమని. తల్లి పాలు వెల కట్టలేనివని . బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు త్రాగించాలని, తల్లి పాలలో కొలో స్ట్రం అనే ప్రోటీన్ పదార్థం ఉంటుందని తెలిపారు. తల్లి పాలు బిడ్డ కి మంచి వ్యాధినిరోధ శక్తి కలిగిస్తాయని తెలిపారు. తల్లి పాలు బిడ్డ కి మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే త్రాగించాలని, 2సంవత్సరాలు వరకు ఇవ్వాలని తెలిపారు. తల్లి పాలు త్రాగడం వల్ల బిడ్డ కి శ్వాస కోశ వ్యాధులు,, స్కిన్ అల్లెర్జి లు, నీళ్ల విరోచనాలు వంటి సమస్యలు రావని తెలిపారు. తల్లి పాలు తాగించడం వల్ల తల్లి కి రొమ్ము క్యాన్సర్ లు, గర్భసయ క్యాన్సర్ లు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృపారాణి పి హెచ్ ఓ . రమణమ్మ పి హెచ్ ఎన్. సూర్ దేవుడు హెల్త్ సూపర్వైజర్. బేబీ రాణి. ఫార్మసిస్ట్ అనిల్ కుమార్. ఎల్ టి శ్రీను. శేషుబాబు తదితరులు పాల్గొన్నారు

# సత్యనారాయణ సేవలు అద్భుతం

### నగర సిపి శంకరబ్రత భాగ్చి



**ఆనందపురం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఆర్ వి సత్యనారాయణ 1962 సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం, చిత్తార పురం గ్రామంలో రాకోటి చిన్నమనాయుడు(లేట్) అచ్చన్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుండే ఎన్నో ఒడుదిడుకులు ఎదుర్కొని , తనకి ఇష్టమైన పోలీసు ఉద్యోగంలో 1984 సంవత్సరంలో చేరి,2011 వరకు వివిధ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించారు 2011-2018 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించి, అనతరం ఏ ఎస్ ఐ గా పనిచేశారు. స్టేషన్లో రైటర్ గా తన ఉద్యోగాన్ని ఎక్కువకాలం పనిచేసినట్లు సత్యనారాయణ తెలిపారు అలాగే 2024 జూన్ నెలలో ఆయన సేవలకు గాను సేవ పథకం తో పాటు 4 వేలు రూపాయలు నగదుపురస్కారాన్ని అందించారు. అలాగే అదనంగా నెలుకు 75 రూపాయల తన జీతం లో ఇవ్వమని పోలీస్ శాఖ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుభశ్రీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగంలో తన వంతు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని భార్య ఊర్మిళ పూర్తి సహకారంతో సాధ్యమైందని, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె మంచి ఉద్యోగాల్లో ఉన్నారని తెలిపారు, అలాగే పదవీ విరమణ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా రావడం పై సీపీ కి ధన్యవాదాలు తెలిపారు. పదవి విరమణ రోజున అందరూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పోలీస్ అధికారులు మండల నాయకులు ఏఎస్ఐ కు రిటైర్మెంట్ రోజున పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో ఏసిపి బి. సునీల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవి తిరుపతిరావు, సబ్ ఇన్స్పెక్టర్లు గంట్యాడ సంతోష్, పందిరి శివ, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, బీసీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి వెన్ని శ్రీనివాసరావు, ఉషావిద్యానికేతన్ అధినేత చందక పాండురంగా, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన షోరూమును ప్రారంభిస్తున్న మలబార్

**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, ఆగస్టు 5వ తేదీన గాజువాకలో తమ కొత్త షోరూమును ప్రారంభిస్తోందని మీడియా ప్రతినిధి తెలిపారు అత్యద్భుతంగా తీర్చిదిద్దబడిన ఈ షోరూం పట్టణంలోని ఆభరణాల ప్రేమికులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆభరణాల షాపింగ్ అనుభూతిని అందిస్తుందని షోరూములో మైన్ డైమండ్ జ్యూవెలరీ, ఎరా అన్కట్ డైమండ్ జ్యూవెలరీ, డివైన్ హెరిటేజ్ జ్యూవెలరీ, ఎథ్నిక్స్ హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ, ప్రెసియా జెమ్స్టోన్ జ్యూవెలరీ, విరాజ్ పోల్కీ జ్యూవెలరీ వంటి మలబార్ ప్రత్యేక బ్రాండ్లతో పాటు, వివిధ సందర్భాలు, వేడుకలకు సరిపోయే బంగారం, వజ్రాలు, పోల్కీ, విలువైన రత్నాలు, వెండి, ప్లాటినం ఆభరణాల యొక్క విస్తృత శ్రేణి సేకరణలు ఈ మలబార్ షోరూములో లభిస్తాయన్నారు పారదర్శకమైన సరసమైన ధరలు అందించడంలో సాటిలేని నిబద్ధతకు ప్రసిద్ధి చెందింది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మలబార్ బ్రాండ్ యొక్క 'ఫెయిర్ ప్రైస్ ప్రామిస్', 'వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్' చొరవ ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల్లో పారదర్శకమైన స్థిరమైన బంగారం ధరలను నిర్ధారిస్తుందని వినియోగదారుల విశ్వాసం పొందుతూ, పారదర్శకత నాణ్యతపై దృష్టి సారించడం ద్వారా మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రపంచవ్యాప్తంగా తమ ఖ్యాతిని పెంచుకుంటుందన్నారు.

# నగరంలో పలు ప్రాంతాలలో కమిషనర్ పర్యటన



**విజయనగరం టౌన్, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** నగరంలో పలు ప్రాంతాలలో కమిషనర్ ఎం ఎం నాయుడు పర్యటించారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పై ప్రజలలో అవగాహన కల్పించారు. గంటస్తంభం ప్రాంతంలో పర్యటించి అక్కడ ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు గూర్చి చైతన్యపరిచారు. గంటస్తంభం కు అనుకొని ఉన్న ప్రధాన కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే రింగ్ రోడ్ లో ఉన్న డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించి వాహనాల రాకపోకల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆలస్యంగా వస్తున్న వాహనాల వివరాలను తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పింఛన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పింఛన్లను త్వరిత గతిన అందజేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

# జీ తెలుగులో నూతన ధారావాహిక

**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** నమ్మకద్రోహానికి బలైన ఇద్దరు వ్యక్తుల జీవితమే ఇతివృత్తంగా తెరకెక్కుతున్న కలవారి కోడలు కనకమహాలక్ష్మి'. సీరియల్ ఆకట్టుకునే కుటుంబ కథగా ప్రేక్షకుల ముందుకు జీ తెలుగులో రాబోతోందని తండ్రీకూతుళ్ల బంధం, భార్యాభర్తల అనుబంధం మధ్య ఉద్వేగభరితంగా సాగే ఈ సరికొత్త సీరియల్ ఆగస్టు 5న ప్రారంభమవుతుందని , సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, జీ తెలుగులో ప్రసారం కానున్నదని మీడియా ప్రతినిధి తెలిపారు కూతురు భవిష్యత్తు కోసం ఆరాటపడే తండ్రి, ఆయన సంతోషం కోసం పాటుపడే కూతురు, తండ్రి కోరికను గౌరవించడం తప్ప మరో కల లేని కనకమహాలక్ష్మి కథే ఈ సీరియల్ అని, ప్రేమ, పెళ్లి, విధి నడుమ సాగే కథ ఉత్కంఠరేపే మలుపులతో ఆకట్టుకుంటుందన్నారు.

# కొత్త 'బిల్ట్ ఫర్ భారత్' ఈసీ 210 హైడ్రాలిక్ ఎక్సవేటర్‌ను ప్రవేశపెట్టిన వోల్వో సీఈ

### -నూతన 'బిల్ట్ ఫర్ భారత్' వోల్వో ఈసీ210 అత్యుత్తమ పనితీరు, అసాధారణ ఇంధన సామర్థ్యం, తక్కువ నిర్వహణ ఖర్చు -మరింత పనితీరు, మెరుగైన విలువ, పెరిగిన ఆదా, అధిక కాలం పని చేయడం చెప్తూ, 'కరో జ్యాదా కి ఉమీద్' ప్రచారం ప్రారంభం -దేశవ్యాప్తంగా 300పైగా అవుట్‌లెట్‌లలో ఉంది

**విశాఖపట్నం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ (వోల్వో సిఇ ఇండియా) ఈరోజు 'బిల్ట్ ఫర్ భారత్' 20-టన్నుల ఎక్స్‌కవేటర్ కొత్త ఈసీ 210ని ఆవిష్కరించింది. ఈ ఎక్స్‌కవేటర్ ను ప్రవేశపెట్టడం అనేది దేశంలోని వినియోగదారుల అవసరాలకు ప్రత్యేకంగా రూపొందించబడిన వినూత్న, సాంకేతికంగా అధునాతన ఉత్పాదనలను అందించడానికి గాను వృద్ధి చెందుతున్న భారతీయ సీఈమార్కెట్ పట్ల కంపెనీకి గల పటిష్ఠ నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఈసీ 210 ఎక్స్‌కవేటర్ అత్యుత్తమ పనితీరు, అసాధారణ ఇంధన సామర్థ్యాన్ని నిర్ధారించడానికి అనేక రకాల విశిష్టతలను కలిగి ఉంది. వోల్వో సిఇ ఇండియా అప్‌టైమ్ పార్ట్స్ హెడ్ అనిర్బన్ బెనర్జి పశ్చిమ రీజియన్ కు చెందిన ఇతర సీనియర్ నాయకుల సమక్షంలో ఈరోజు ఇక్కడ కొత్త ఎక్స్‌కవేటర్‌ను ఆవిష్కరించారు. ఈసీ 210 ఆవిష్కరణలో భాగంగా, వోల్వో సీఈ "కరో జ్యాదా కి ఉమీద్" అనే కొత్త బ్రాండ్ ప్రచార కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ ప్రచార కార్యక్రమం, తన తాత్వికతను ప్రతిబింబించే చిత్రం ద్వారా, మరింత ఆశించడం, శ్రేష్ఠత కోసం ప్రయత్నించడం,పరిమితులనుఅధిగమించడం వంటి మానవ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది ఎక్కువపనితీరు, ఎక్కువవిలువ, ఎక్కువసేవింగ్స్ మరియు ఎక్కువఅప్‌టైమ్ అనే 4 స్తంభాల క్రింద ఈసీ 210 యొక్క కీలక విలువ ప్రతిపాదనను చాటిచెబుతుంది. వోల్వో సీఈ వ్యూహాత్మక వృద్ధి ప్రణాళికలకు విశాఖపట్నం కీలకమార్కెట్‌ను సూచిస్తుంది. 150 యూనిట్ల మార్కెట్ పరిమాణం మరియు అద్దె సేవలు మరియు పోర్ట్ కార్యకలాపాలలో ముఖ్యమైన వినియోగాలతో, విశాఖపట్నం ప్రత్యేక మౌలిక సదుపాయాల అవసరాలకు తగిన పరిష్కారాలను అందించడంలో మా నిబద్ధతను నొక్కి చెబుతుంది. మా తాజా ఉత్పాదనల పరిచయం వోల్వో సీఈ సుస్థిర, వినూత్న మౌలిక సదుపాయాల ఉత్పాదనల దృష్టికి అనుగుణంగాఈ ప్రాంత అభివృద్ధి పథాన్ని బలపరుస్తుంది. ఈ ప్రాంతంలోని అవకాశాల గురించి మేం సంతోషిస్తున్నాం.నగర నిరంతర వృద్ధిలో భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నాం" అని వోల్వో సిఇ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డిమిత్రోవ్ కృష్ణన్ అన్నారు. సరికొత్త ఈసీ210, 20-టన్నుల క్లాస్ క్రాలర్ ఎక్స్‌కవేటర్ అత్యుత్తమ పనితీరును అందిస్తుంది. వినియోగా లకు సంబంధించి రకరకాల ప్రయోజనాలను అందిస్తుంది. పరిశ్రమలోనే ప్రముఖమైన భద్రత, ఆపరేటర్ సౌలభ్యం, సర్వీసింగ్ సౌలభ్యాన్ని అందిస్తుంది. అత్యుత్తమ అటాచ్‌మెంట్ కాన్ఫిగరేషన్, తదుపరి తరం పాజిటివ్ కంట్రోల్ హైడ్రాలిక్స్ సిస్టమ్‌తో, ఇది సాటిలేని కచ్చితత్వం, వేగవంతమైన ప్రతిస్పందన సమయాన్ని అందిస్తుంది. ఇది భారతదేశంలో తయారు చేయబడిన టి3 ఎలక్ట్రానిక్ ఇంజిన్‌తో వస్తుంది, ఇది తక్కువ ఆర్పీఎంవద్ద కూడా అధిక టార్క్‌ను అందించగలదు. వివిధ వినియోగాలల కోసం 10 వర్కింగ్ మోడ్‌ల కారణంగా ఎంతగానో ఇంధనాన్ని ఆదా చేసే విశిష్టతలను కలిగిఉంటుంది. డూ-ఇట్-ఆల్ ఎక్స్‌కవేటర్ రోడ్డు నిర్మాణం, రాళ్లను పగులగొట్టడం, సాధారణ నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ, క్వారీలు, ఇసుక మైనింగ్ మొదలైన ఏవైనా తేలికపాటి, మధ్యస్థ లేదా భారీస్థాయివినియోగాల కోసం అధిక విశ్వసనీయత, అసాధారణమైన ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుంది. అంతేగాకుండావినియోగదారులు దీని వినియోగదారు-స్నేహపూర్వక మొబైల్ యాప్ ద్వారా అత్యంత సులభంగా సర్వీస్ ను బుక్ చేసుకోవచ్చు, మెషిన్ పని చేసే సమయాన్ని పెంచడానికి 48 గంటలలోపు సర్వీస్ హామీని పొందవచ్చు. వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ (వోల్వో సీఈ) శ్రీరామ్ ఆటోమాల్ తో భాగస్వామ్యం కూడా కలిగి ఉంది. ఇది ప్రీ-ఓన్డ్ వాహనాలు, నిర్మాణ సామగ్రికి సంబంధించి భారతదేశ అతిపెద్ద 'ఫిజిటల్' మార్కెట్‌ప్లేస్. మెషిన్ ఎక్స్ఛేంజ్ మరియు పారవేయడం కోసం ఒక బలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ఈ భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది. తమ ప్రస్తుత ఫ్లీట్‌ను భర్తీ చేయడం ద్వారా కొత్త వోల్వో మెషీన్‌లను కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్న కొనుగోలుదారులకు ఇది తన సేవలు అందిస్తుంది. పరికరాల జీవితచక్ర నిర్వహణలో సర్క్యులారిటీని ప్రోత్సహించడం, సెకండ్-లైఫ్ మరియు చివరి దశలో వాటిని తీసేయడానికి సంబంధించిసుస్థిరమైన పద్ధతులకు మద్దతునివ్వాలనే వోల్వో వ్యూహాత్మక ఆశయంతో ఈ కార్యక్రమం జతకట్టింది.

# విద్యాభివృద్ధిలో చక్రధరరావు సేవలు అజరామరం

### -చక్రధరరావు సంస్థలు ఉన్నత విలువలు కలిగి ఉన్నాయి -శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఆగస్టు 1, మేజర్‌న్యూస్:** విద్యాభివృద్ధిలో యాళ్ల చక్రధరరావు సేవలు అజరామరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆదివారంపేట సమీపంలో ఉన్న చక్రధరరావు విద్యాసంస్థల కార్యాలయంలో గురువారం చక్రధరరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర గణిత బ్రహ్మగా, ఉత్తమ ఉపాధ్యాయునిగా చక్రధరరావు విద్యారంగంలో తనదైన కీలకపాత్ర వహించారని చెప్పారు. ప్రతి ఏడాది చక్రధరరావు విద్యాసంస్థల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని చెప్పారు. జిల్లా యువతకు రాష్ట్ర, దేశ స్థాయిలో ఉన్నతమైన విద్యను అందించి వారిని గొప్ప స్థితిలో స్థిరపడేలా అవకాశాలు అందిస్తున్న చక్రధరరావు అభినందనీయుడని తెలిపారు. ఎందరో పేద విద్యార్థులకు చేయూతనందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న చక్రధరరావుకు విద్యార్థులు ఎంతో రుణపడి ఉంటారన్నారు. అనంతరం ఆయన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని, రక్త కొరత లేని సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి జగన్ మోహన్ రావు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రెడ్డి గిరిజ శంకర్, అందవరపు సంతోష్, టిడిపి నాయకులు, చక్రధరరావు విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.